# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి  సంపుటి: 10 సంచిక :246  ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్  తేది: బుధవారం 10-12-2025  పేజీలు:4 వెల: 2.00


## ఢిల్లీ విమానాశ్రయంలో భారీగా గంజాయి పట్టివేత

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు సోమవారం భారీగా విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల లగేజీ బ్యాగుల్లో దాచిపెట్టి గంజాయిని తరలించే ప్రయత్నం చేస్తుండగా కస్టమ్స్ సిబ్బంది గుర్తించారు. అధికారులకు స్కానింగ్ సమయంలో అనుమానం రావడంతో ఆ ఇద్దరి బ్యాగులను సోదా చేయగా అందులో పెద్ద మొత్తంలో గంజాయి బయటపడింది. అధికారులు స్వాధీనం చేసుకున్న విదేశీ గంజాయికి అంతర్జాతీయ మార్కెట్‌లో దాదాపుగా రూ.15 కోట్లు విలువ ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గంజాయిని స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నించిన కేటుగాళ్లను అధికారులు అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. విదేశీ మార్గాల ద్వారా డ్రగ్స్ రవాణా పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీలను మరింత కఠినతరం చేసినట్లు కస్టమ్స్ వర్గాలు వెల్లడించాయి.

## స్వయం పాలనకు స్ఫూర్తి తెలంగాణ తల్లి : సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్ : స్వరాష్ట్రంలో స్వయం పాలనకు స్ఫూర్తి..తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు అని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. జిల్లాల కలెక్టరేట్లలోని తెలంగాణ తల్లి విగ్రహాల వర్చువల్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. డిసెంబర్ 9, 2009 న సోనియా గాంధీ నేతృత్వంలో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన రోజు అని గుర్తు చేశారు. ఆ ప్రకటన తెలంగా ప్రజలకు సంతోషాన్ని ఇచ్చింది.. ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు. అందుకే ప్రజా ప్రభుత్వంలో ఈ రోజుని తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించుకున్నాం తెలిపారు. అందులో భాగంగానే గత ఏడాది సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పరిపాలనలో ఒక స్ఫూర్తి తీసుకొచ్చాం అన్నారు. ఇవాళ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించుకున్నాం అని పేర్కొన్నారు.తెలంగాణ తల్లిని తలచుకుని పనులు మొదలుపెట్టేందుకే వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరు దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని గుర్తు చేశారు. సోనియాగాంధీ ఎన్నో అడ్డంకులను అధిగమించి మరీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. మా పథకాలు, కార్యక్రమాల్లో సోనియా, మన్మోహన్‌సింగ్ స్ఫూర్తి కొనసాగుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు. 2004 లో కరీంనగర్ గడ్డపై నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ మాట ఇచ్చారని, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదినం డిసెంబర్ 9వ తేదీ కావడం విశేషం అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను జరుపుకుంటాం అని తెలిపారు.

## సీఎం మార్పుపై యతీంద్ర సిద్ధరామయ్య సంచలన వ్యాఖ్యలు

బెంగళూరు :కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య ను తప్పించి.. ఆయన స్థానంలో డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్ ను సీఎంగా కాంగ్రెస్ అధిష్ఠానం నియమించబోతోందని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ ప్రచారం వేళ సీఎం సిద్ధూ కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్య తాజాగా స్పందించారు. ఈ మేరకు కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలను తోసిపుచ్చారు. తన తండ్రి ఐదేండ్ల పూర్తి పదవీకాలం సీఎంగా కొనసాగుతారని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా యతీంద్ర కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం పదవిని చేపట్టాలని ఆకాంక్షిస్తున్నందున నాయకత్వ మార్పుపై గందరగోళం తలెత్తిందన్నారు. అయితే, పార్టీ హైకమాండ్ మాత్రం ఇప్పటికీ నాయకత్వ మార్పుపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోమని స్పష్టం చేసినట్లు తెలిపారు. 'సీఎల్పీ సమావేశంలో ఎన్ని సంవత్సరాలు అనే దాని గురించి చర్చించరు. వారు కేవలం సీఎంని మాత్రమే నిర్ణయిస్తారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎలాంటి నాయకత్వ మార్పు ఉండదని హైకమాండ్ స్పష్టం చేసింది. సిద్ధరామయ్య ఐదేండ్లు సీఎంగా ఉంటారని నేను స్పష్టం చేయాలనుకుంటున్నా. రాష్ట్రంలో నాయకత్వ మార్పుకు ఎలాంటి కారణం



కనిపించడం లేదు' అని యతీంద్ర అన్నారు.ఇక యతీంద్ర వ్యాఖ్యలకు డీకే స్పందిస్తూ.. 'నేను చాలా సంతోషంగా ఉన్నాను. రాష్ట్రానికి మంచి జరగనివ్వండి.. మంచి జరగనివ్వండి' అని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు రెండున్నరేళ్ల పాలన పూర్తయిన తర్వాత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే.

## కేంద్రానికి మాత్రమే తమిళనాడు, పుదుచ్చేరి వేర్వేరు

చెన్నై: కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే తమిళనాడు , పుదుచ్చేరి వేర్వేరు అని, తాము మాత్రం అందరం కలిసే ఉన్నామని నటుడు, టీవీకే చీఫ్ విజయ్ అన్నారు. పుదుచ్చేరిలోని ఉప్పాలం లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కరూర్ తొక్కిసలాట అనంతరం జరిగిన ఈ తొలి బహిరంగసభలో ఆయన.. తమిళనాడులోని డీఎంకే సర్కారు పై తీవ్ర విమర్శలు చేశారు.పుదుచ్చేరికి మద్దతు ఇవ్వడం తన బాధ్యత అని విజయ్ పేర్కొన్నారు. సీఎం రంగసామి నేతృత్వంలోని అక్కడి ప్రభుత్వం డీఎంకే ప్రభుత్వం వంటిది కాదని, ప్రతిపక్ష పార్టీలతోనూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని మెచ్చుకున్నారు. మాకు ప్రత్యర్థి అయినా మా పార్టీ నిర్వహిస్తున్న ర్యాలీకి అడగగానే భద్రత రంగస్వామి ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాష్ట్ర పాలనకు సంబంధించిన విషయాలను పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి నేర్చుకోవాలని సూచించారు.కానీ ఆయన (స్టాలిన్) ఎప్పటికీ నేర్చుకోరని విజయ్ వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. మాజీ సీఎం, దివంగత



ఎంజీ రామచంద్రన్‌కు పుదుచ్చేరితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ.. పుదుచ్చేరికి పూర్తి రాష్ట్ర హోదా ఇవ్వాలని పునరుద్ఘాటించారు. తమకు రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నో సంవత్సరాల నుంచి 16 తీర్మానాలను ప్రవేశపెట్టినా కేంద్రం పట్టించుకోవట్లేదని విమర్శించారు.

## కేసీఆర్ అంటే పోరాటం.. రేవంత్ అంటే వెన్నుపోటు: హరీశ్ రావు




హైదరాబాద్: కేసీఆర్ దీక్ష ఫలితంగానే డిసెంబర్ 9 ప్రకటన వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ అన్నారు. కేసీఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా అని ప్రశ్నించారు. దీక్ష చేయకపోతే ఢిల్లీ దిగి వచ్చేదా అని నిలదీశారు. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం అన్నారు. కేసీఆర్ అంటే పోరాటం.. కేసీఆర్ అంటే త్యాగం అని, రేవంత్ అంటే వెన్నుపోటు.. రేవంత్ అంటే ద్రోహం అని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర అంటూ రాస్తే రేవంత్‌కు ఉన్న స్థానం ద్రోహం, వెన్నుపోటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి అని చెప్పారు. తెలంగాణ భవన్‌లో విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్ రావు.. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. 'డిసెంబర్ 9 అనేది చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. నవంబర్ 29న దీక్షా దివస్ జరుపుకున్నాం. నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన లేదు. డిసెంబర్ 9 లేకపోతే జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం లేదు. తెలంగాణ ఉద్యమంలో ఈ 3 రోజులు చాలా కీలకమైనవి.నిమ్స్‌లో కేసీఆర్ 11 రోజులు ఆమరణ దీక్ష దేశారు. కేసీఆర్ దీక్ష ఫలితం డిసెంబర్ 9న ప్రకటన వచ్చింది. కేసీఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా?. దీక్ష చేయకపోతే ఢిల్లీ దిగి వచ్చేదా?. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితం తెలంగాణ రాష్ట్రం. దీక్ష లేకపోతే తెలంగాణ ప్రకటనే రాదు. ప్రకటన వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, దీక్ష ఫలితం. కేసీఆర్ అంటే పోరాటం.. కేసీఆర్ అంటే త్యాగం. రేవంత్ అంటే వెన్నుపోటు.. రేవంత్ అంటే ద్రోహం. రాజీనామాలు చేయాలంటే జీరాక్స్‌లు ఇచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి. జై తెలంగాణ అంటే తుపాకీతో కాలుస్తా అని రైఫిల్ పట్టుకున్న వ్యక్తి రేవంత్. తెలంగాణ ఉద్యమ చరిత్ర అంటూ రాస్తే రేవంత్‌కు ఉన్న స్థానం ద్రోహం, వెన్నుపోటు.ఈ రోజు తెలంగాణ తల్లిని మారుస్తున్నారు. రేవంత్ సృష్టించిన తల్లిని పెడుతున్నారు. తెలంగాణ ఉద్యమం, భావోద్వేగాల మధ్య పుట్టిన తల్లి తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లిని ఊరూరా ప్రజలే పెట్టుకున్నారు. తెలంగాన ఉద్యమంలో పుట్టిన తల్లిని మార్చే హక్కు రేవంత్‌కు లేదు. రేవంత్ తెలంగాణ ప్రజల తలరాతలు మారుస్తా అన్నాడు. ప్రజల తలరాతలు మార్చలేదు కానీ, తెలంగాణ తల్లిని మాత్రం మార్చాడు. ఎరువులు, విత్తనాల కొరత సృష్టించాడు. ధరలు పెంచాడు. రైతుబంధు ఎగ్గొట్టాడు. రైతుబీమాకు డబ్బులు కట్టలేదు. మహిళలను ఆగం చేశాడు. రాష్ట్రాన్ని ఆగం చేశాడు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నాడు.రవీంద్రభారతి అవార్డుల కంటే రామోజీ ఫిలింసిటీ అవార్డు గొప్పదని అంటున్నాడు. రవీంద్రభారతిలో దాశరథి, కాళోజీ, గద్దరన్న అవార్డులు ఇస్తారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి. హైదరాబాద్‌కు ట్రంప్ రోడ్డు అని పేరు పెడుతాడంటా. తెలుగు పిల్లలను జైళ్లలో వేసినందు ట్రంప్ పేరు పెడతావా?. మన దేశాన్ని ఇబ్బంది పెట్టి వ్యాపార సంస్థలు మూతపడి, పిల్లల ఉద్యోగాలు ఊడగొట్టినందుకు ట్రంప్ పేరు పెడుతావా?. హైదరాబాద్ పిల్లలు ఉద్యోగాలు రాక అమెరికాలో నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ట్రంప్ ఫీజులు పెంచారు. రేవంత్ రెడ్డి నాడు సోనియా గాంధీని బలి దేవత అన్నాడు. 500 మంది పిల్లల చావుకు కారణం సోనియా అన్నాడు. అప్పుడు బలిదేవత.. ఇప్పుడు దేవత అంటున్నాడు. సోనియమ్మ ఇచ్చిన తెలంగాణను వెనక్కి తీసుకున్నందుకు డిసెంబర్ 23న తెలంగాణ విద్రోహ దినం జరుపుకోవాలి' అని హరీశ్ రావు విమర్శించారు.

## పౌరసత్వం కేసులో సోనియా గాంధీకి ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు నోటీసులు




న్యూఢిల్లీ:కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, ఎంపీ సోనియా గాంధీకి ఢిల్లీ రౌస్ అవెన్యూ సెషన్స్ కోర్టు నోటీసులు జారీ చేసింది. భారత పౌరసత్వం పొందటానికి మూడేళ్ల ముందే సోనియా గాంధీ ఓటు హక్కు పొందారని..నకిలీ పత్రాల ద్వారా ఓటు హక్కు పొందిన ఆమెపై కేసు నమోదు చేయాలని దాఖలైన పిటిషన్?కు సమాధానం చెప్పాలని కోర్టు ఆమెకు సమన్లు పంపింది. ఇదే కేసులో సోనియా గాంధీతో పాటు ఢిల్లీ పోలీసులకు కూడా నోటీసులు జారీ చేసిన కోర్టు వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

### కేసు ఏంటంటే..?

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందటానికి మూడేళ్ల ముందే ఆమె పేరు ఓటర్ల జాబితాలో చేర్చబడిందని.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీకి చెందిన న్యాయవాది వికాస్ త్రిపాఠి రౌస్ అవెన్యూ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోనియా గాంధీ పేరును 1980లో ఓటర్ల జాబితాలో చేర్చారని.. కానీ1983లో ఆమె భారత పౌరసత్వం పొందారని పిటిషనర్‌కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.భారత పౌరసత్వం పొందటానికి ముందే ఓటు హక్కు పొందడటం కోసం ఆమె నకిలీ పత్రాలను సృష్టించారని పిటిషనర్ ఆరోపించారు. సరైన ఆధారాలు లేకపోవడంతో 2025, సెప్టెంబర్?లో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా ఈ పిటిషన్ డిస్మస్ చేశారు. ఈ క్రమంలో మెజిస్టీరియల్ కోర్టు ఆదేశాన్ని సవాల్ చేస్తూ రౌస్ అవెన్యూ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశాడు వికాస్ త్రిపాఠి. మంగళవారం (డిసెంబర్ 9) ఈ రివిజన్ పిటిషన్?పై విచారణ చేపట్టిన రౌస్ అవెన్యూ కోర్టుల ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే సోనియా గాంధీ, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను 2026, జనవరి 6కు వాయిదా వేశారు.

## మీ బండారం విప్పితే..తట్టుకోలేవు : ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్ : తనను కబ్జాదారులు అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శలు గుప్పించడంపై కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నేను నీ గురించి చెబితే ..నీ బండారాన్ని తెలంగాణ నుంచి ఢిల్లీదాక విప్పితే తట్టుకోలేవు అని, నీ తల ఎక్కడ పెట్టుకుంటావో తెలియదు అని హెచ్చరించారు. మీ నాయన కేసీఆర్ పేరు అడ్డం పెట్టుకుని బట్టల షాపులు, బంగారు షాపులను ఎవర్ని వదలకుండా దోచుకున్నావని నువ్వు నన్ను విమర్శిస్తావా? అని ఫైర్ అయ్యారు. నీ అత్తగారి ఊర్లో ఎంపీగా గెలవడం చేతకాని నీవు మాపై మాట్లాడుతావా?" అంటూ ఎద్దేవా చేశారు. బాలానగర్ లో కవిత, ఆమె భర్త కబ్జాల చిట్టా ఉందని, ఓవర్ ల్యాప్ ల్యాండ్ ని.పార్టీ పేరు చెప్పుకొని 36 ఎకరాల భూమిని దోచుకుందని విమర్శించారు. ట్రక్ పార్కు గురించి కవితకు ఏం తెలుసు .. కే.పి.హెచ్.బిలో స్కూల్ మేము కడుతున్నాం..ఏం తెలుసు నీకు అని విమర్శించారు.నా నియోజకవర్గంలో కవిత పర్యటన ఉందని తాను భయపడిపోయానంటూ ఆమె చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నీలాంటి కుక్కలు నా నియోజకవర్గానికి మస్తుగా వచ్చిపోయారంటూ ఘాటు విమర్శలు చేశారు. స్థానిక ప్రజలే నాకు దేవుళ్లు అన్నారు. సీఎం, కేంద్రం సీరియస్ గా తీసుకుంటే మీ సంగతేమిటో మొత్తం బయటకొస్తుందన్నారు. జిల్లాలలో తిరుగుతూ ఎమ్మెల్యేలను తిట్టడం..తర్వాతా వారితో సెటిల్ చేసుకోవడం అలవాటుగా పెట్టుకుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మంత్రి పదవులు అమ్ముకున్నదని కృష్ణారావు ఆరోపించారు. హరీష్ రావును పార్టీ నుంచి వెళ్లగొట్టి, సీఎం రేవంత్ రెడ్డితో కేటీఆర్ ను జైలుకు పంపించి పార్టీని ఆధీనంలోకి తీసుకుని రాష్ట్రాన్ని దోచుకునేందుకు కుట్ర చేసిందని విమర్శించారు.నేను తెలంగాణ ఉద్యమం చేసినా అని ఎప్పుడు చెప్పలేదని..ఆనాడు టీడీపీ విధానాల మేరకు పనిచేశామన్నారు. నీలాగా మేం చెట్టుపేరుచెప్పి కాయలు అమ్ముకోలేదన్నారు. గాంధీ మాదిరిగా పేరు ఉన్న కేసీఆర్ పరువు తీస్తుందన్నారు. నీకు ఉద్యమకారులపై ప్రేమ ఉంటే నీ ఎంపీ, ఎమ్మెల్సీ పదవులు వారికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.హైదరాబాద్ ఎమ్మెల్యేల పై గౌరవం లేకుండా అవినీతి పరులంటూ విమర్శించడం సరికాదన్నారు. చరిత్ర హీనురాలు కవిత మమ్మల్నివిమర్శించే అర్హత లేదు అన్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ కోసం




హైదరాబాద్ ఎమ్మెల్యే లు కలిసి నడుస్తున్నాం అన్నారు. నగరంలో ఉండే ఎమ్మెల్యేలు బీ.టీ బ్యాచ్ అని ఎమ్మెల్సీ కవిత విమర్శించడాన్ని తప్పుబట్టారు. ఉద్యమంలో పనిచేయకపోయేనా తాము అందరం తెలంగాణ కోసం పని చేశాం అన్నారు. తెలంగాణ చరిత్ర ను లిక్కర్ పేరుతో కవిత నాశనం చేసిందని విమర్శించారు. చివరకు ఇంట్లో కుక్క పేరు కూడా విస్కీ అని పెట్టుకుందని..మూడు సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన నన్ను అనే స్థాయి ఆమెకు లేదు అన్నారు. పదేళ్లు పదవులు అనుభవించి ఇప్పుడు బీసీ వాదం ఎత్తుకుందని, కవిత ఉంటున్న ఇప్పటి ఇల్లు వంటిది..మాజీ సీఎం కేసీఆర్ కు కూడా లేదు అన్నారు.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు

హైదరాబాద్,మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు మెయిల్ వచ్చింది. బాంబు పేలకూడదంటే మిలియన్ డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మెయిల్‌తో అప్రమత్తమైన శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు.. ఐసోలేషన్ బే దగ్గర ఫ్లైట్‌ని ఉంచి పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఆ అనుమానాస్పద మెయిల్ న్యూయార్క్ నుంచి వచ్చినట్టు నిర్ధారించారు. ఎలాంటి ముప్పు లేదని సెక్యూరిటీ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఈ ఏడాదిలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి 20కిపైగా బెదిరింపు కాల్స్, మెయిల్స్ వచ్చాయి. 5 ఘటనల్లో నిందితుల గుర్తించారు. మిగతా కేసుల్లో విచారణ కొనసాగుతోంది.

## రండి..మా ముత్తాత గురించి చర్చిద్దాం: మోడీకి ప్రియాంక అదిరిపోయే కౌంటర్

న్యూఢిల్లీ,పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో సోమవారం లోక్‌సభలో ఆసక్తికర ఘట్టం జరిగింది. జాతీయ గేయం వందేమాతరంపై చర్చ సందర్భంగా ప్రధాన మంత్రినరేంద్ర మోడీ దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూపై విమర్శలు గుప్పించారు.వందేమాతరం గేయాన్ని చిదిమేశారని.. దీనిలో పంక్తులను కుదించి అవమానించారని ఆయన వ్యాఖ్యానించారు. వందేమాతరంపై చర్చలో సుమారు 45 నిమిషాల పాటు ప్రధాని మాట్లాడారు. ఇందిరమ్మ సహా.. నెహ్రూ పాలనలపై ఆయన విమర్శలు గుప్పించారు.అయితే.. సాయంత్రం అదే లోక్‌సభలో మాట్లాడిన కాంగ్రెస్ నాయకురాలు, వైనాడ్(కేరళ) ఎంపీ ప్రియాంక గాంధీ.. ప్రధాని మోడీ సహా బీజేపీ నాయకులకు కౌంటర్ ఇచ్చారు. ఎప్పుడు ఏ అంశంపై చర్చ జరిగినా.. మా ముత్తాత(నెహ్రూ) ప్రస్తావన లేకుండా ఉండడం లేదు. మాకంటే ఎక్కువగా ఆయనను మీరు(బీజేపీ) కలవరిస్తున్నారు. మంచిదే. కానీ, దేశంలో అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని వదిలేసి.. మా ముత్తాత చుట్టూ మీరు తిరుగుతున్నారు. ప్రజలు, వారి సమస్యలు, దేశ భవితవ్యాన్ని కూడా ఫణంగా పెడుతున్నారు. ఇది మీకు వినసొంపుగా ఉంటుంది(నెహ్రూపై విమర్శలు) అని వ్యాఖ్యానించారు.ఇదేసమయంలో ప్రియాంక గాంధీ కీలక సూచన చేశారు. తరచుగా ఏ చర్చ వచ్చినా నెహ్రూ గురించి ప్రసంగించడం ఎందుకని.. వందేమాతరం గేయంపై ఏ విధంగా అయితే చర్చ పెట్టారో.. అలానే తన ముత్తాత(నెహ్రూ)పైనా ఒక రోజు రోజంతా చర్చ పెట్టాలని ఆమె సూచించారు. ఆ రోజు పూర్తిగా మీరు నెహ్రూ గురించి ఏం చెప్పాలని అనుకుంటున్నారో.. అంతా చెప్పేయండి.. ఏం తిట్టా లని అనుకుంటున్నారో అంతా తిట్టేయండి. ఇక్కడితో ఛాప్టర్ క్లోజ్ అయిపోతుంది. అంతేకానీ.. ప్రతిసారీ చర్చల్లో నెహ్రూ ప్రమేయం ఎందుకు? ప్రజల సమస్యలు లేవా?. వాటిని ప్రస్తావించాల్సిన అవసరం లేదా అని ప్రియాంక ప్రశ్నించారు.అయితే.. ఈ



ప్రకటన చేస్తున్న సమయంలో బీజేపీ సభ్యులు తీవ్రస్థాయిలో ఎదురు దాడి చేశారు. ఒకరకంగా.. లోక్‌సభలో తీవ్ర గందరగోళం సృష్టించారు. అయినప్పటికీ ప్రియాంక గాంధీ ఎక్కడా తడబడకుండా ప్రసంగించడం.. మోడీ చేసిన వ్యాఖ్యలకు ఆమె చురకలు అంటించడం గమనార్హం. దీనిపై లోక్‌సభ స్పీకర్ చిరునవ్వులు చిందించారు. మరోవైపు.. బీజేపీ సభ్యుల ఆందోళనను కాంగ్రెస్ పక్ష సభ్యులు తప్పుబట్టారు. బీజేపీ సభ్యులు అరుస్తుంటే వారించరా? అని ప్రశ్నించారు.

### రేణుకా చౌదరి శునకం వివాదంపై బీజేపీ సీరియస్

న్యూఢిల్లీ,కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిపై వచ్చిన హక్కుల ఉల్లంఘన నోటీసును రాజ్యసభ ఛైర్మన్ ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. పార్లమెంట్ ప్రాంగణంలోకి శునకాన్ని తీసుకువచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ సభ్యులు ఇచ్చిన నోటీసుపై విచారణ జరపాలని కమిటీని ఆదేశించారు.

## సంపాదకీయం

బుధవారం 10-12-2025

# ఇండిగో సంక్షోభం వెనక కుట్ర కోణం ఉందా ?

ఇండిగో విమానయాన సంక్షోభం మనకు ఓ గుణపాఠం కావాలి. దేశీయ విమానయాన రంగాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఇప్పుడు గుర్తుకు తెచ్చుకోవాలి. అలాగే 140కోట్లమంది ఉన్న మనదేశంలో రవాణారంగం అంతగా అభివృద్ధి చెందలేదు. విమానయానరంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కోవడానికి ప్రభుత్వ విధానాలు. ఇంధన ధరలే కారణం. ఎంతోమందికి ఉపాధి కల్పించే ఈ రంగం పట్ల గత దశాబ్దాలంగా పెద్దగా విస్తరణ ప్రయత్నాలు సాగడం లేదు. ప్రైవేట్ విమానరంగాలను ఇప్పటి నుంచయినా ప్రోత్సహించాల్సి ఉంది. ఎంతగా అంటే చౌకవిమానాలు అందుబాటులోకి వచ్చేందగా చూడాలి. ఇకపోతే ఇండిగో సంక్షోభం వెనక ఏదైనా కుట్ర దాగివుందా అన్న కోణంలో దర్యాప్తు చేయాలి. ఎందుకంటే దేశీయంగా విమానయాన సంస్థలు తక్కువగా ఉన్న సమయంలో ఇండిగో ఎందుకిలా చేసిందన్న అనుమానాలు వస్తున్నాయి. కింగ్‌ఫిషర్ తదితర సంస్థలు మూతపడ్డ తరవాత పైలెట్లు, విమానరంగ సిబ్బంది అనేకమంది ఉద్యోగాల కోసం చూస్తున్నారు. ఉద్యోగుల కొరత లేదు. అలాగే ప్రయాణికుల కొరత లేదు. అయితే ఇండిగో మోనోపలీ కొనసాగుతున్నా..ఎందుకు సంక్షోభంలోకి నెట్టిందన్న అనుమానాలు వస్తున్నాయి. విమానాలకు బాంబు బెదరింపులు, ఇండిగో సంక్షోభం వంటివన్నీ వరుసగా సాగుతున్న తీరు అనుమానాలను బలపడేలా చేస్తున్నాయి. దీనివెనక ఏదైనా విదేశీ హస్తం ఉందా అన్నది కూడా చూడాలి. వరుస ఘటనలు అనుమానాలు కలిగిస్తున్నాయి. ఆపరేషన్ సింధూర్ తరవాత ఘటనలు చూస్తుంటే అనేక అనుమానాలు వస్తున్నాయి. దీనిపై కేంద్రం ఈ కోణంలో దర్యాప్తును చేపట్టాలి. అలాగే తక్షణం సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. పెద్ద ఎత్తున ఈ రంగంలో శిక్షణ సంస్థలను ప్రారంభించి పదుల సంఖలో విమానయాన సంస్థలను ప్రోత్సహించాలి. దేశీయంగా విమాన రంగాన్ని బలోపేతం చేయాలి. లేకుంటే ఇప్పుడునట్లుగానే సాగితే ఇంతకుమించి రేపు సంక్షోభం రావచ్చు. ప్రజలు ఇప్పుడు విమాన ప్రయాణపై పెద్ద ఎత్తున ఆధారపడు తున్నారు. దేశంలో ప్రయాణానికి, విదేవాలకు వెళ్లడానికి పెద్ద ఎత్తున విమానాలపై ఆధారపడుతున్నారు. ఈ క్రమంలో ఒక్క ఇండిగో సంక్షోభంతోనే ఎంతమంది వెతలు పడ్డారో చూస్తున్నాం. ఎయిర్ ఇండియా టాటాల చేతికి వెళ్లినా పూర్తిస్తాయిలో తన ఆధిపత్యం కొనసాగించడం లేదు. యూరప్ దేశాలతో పోల్చుకుంటే మనదేశంలో విమానాశ్రయాలు, విమానాల సంఖ్య చాలా తక్కువ. బుట్లెట్, ట్రైన్లు, వందేభారత్‌లు ఎన్ని వచ్చినా మన జనాభాకు పెద్ద ఎత్తున విమానాలు రావాల్సిందే. దేశీయంగా విమానాల రాకపోకలకు చాలా డిమాండ్ ఉంది. అలాగే విమానాశ్రయాల విస్తరణ కూడా జరగాల్సి ఉంది. హైదరాబాదం శంషాబాద్ విమనాశ్రయం తీసుకుంటే ఎప్పుడూ కిటకిటలాడుతోంది. బేగంపేట విమానాశ్రయాన్ని కూడా తిరిగి సామాన్య విమానాలకు అందుబాటు లోకి తీసుకుని రావాలి. శంషాబాద్‌పై ఒత్తిడి తగ్గించాలంటే లోకల్ విమానాలకు అనగుణంగా బేగంపేటను పునరుద్ధరించాల్సి ఉంది. గత కొద్దిరోజుల నుంచి దేశ విమాన ప్రయాణీకులను ఇండిగో సంక్షోభం కలవర పెడుతోంది. నిత్యం వందల సంఖ్యలో ఇండిగో విమాన సర్వీసులు రద్దవుతున్నాయి. ప్రయాణీకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు అన్ని విమాన సంస్థలు టికెట్ ధరల్ని భారీగా పెంచేస్తున్నాయి. టికెట్ ధరలు ప్రయాణీకుల పాలిట శాపంగా మారిపోయాయి. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లడానికి ఏకంగా 40 వేల రూపాలయు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఇండిగో సంక్షోభంపై విచారణ జరపటానికి భారత అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు తిరస్కరించింది. కేంద్రం ప్రస్తుతం సంక్షోభ నివరణకు చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఇపస్పుడ విచారణ అవసరం లేదని తెలిపింది. ఇండిగో సంక్షోభంపై కేంద్రం సరైన దిశలోనే చర్యలు చేపడుతోందని తెలిపింది. ప్రస్తుతం తాము ఎలాంటి చర్యలు తీసుకోదల చుకోలేదని స్పష్టం చేసింది. ఇండిగో సంక్షోభం తీవ్రమైన సమస్యే కానీ కేంద్రం చర్యలు సరైన దిశలోనే ఉన్నాయని అంది. అయితే ఆదివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా ఏకంగా 650 ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. అందులో శంషాబాద్ నుంచి 115 సర్వీసులు, బెంగళూరు నుంచి 150, ఢిల్లీ నుంచి 108 సర్వీసులు ఉన్నాయి.ఈ నేపథ్యంలోనే ఇండిగో ఓ కీలక ప్రకటన చేసింది. బుధవారం నాటికి దాదాపు అన్ని సర్వీసులను పునరుద్ధ రిస్తామని ప్రకటించింది. రద్దయిన ఇండిగో విమాన సర్వీసులకు సంబంధించిన రీఫండ్‌ను ఎప్పటికప్పుడు సంస్థ చెల్లిస్తోంది. ఆదివారం ఉదయానికల్లా 610 కోట్ల రూపాయలు రీఫండ్ చేసినట్లు ఇండిగో సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశంలోని కీలక రంగాల్లో ప్రభుత్వ ఆధిపత్యం ఉండి తీరాలని ప్రైవేట్ వాళ్ల పెత్తనానికి వదిలేస్తే తాజాగా నెలకొన్న విమానయాన రంగం ఎలా కకావికలం అయ్యిందో దేశం అంతా చూస్తున్నది. ఇది కచ్చితంగా పాలకవర్గ విధానాల వల్ల వచ్చిన సంక్షోభమని లెఫ్ట్ నేతలు విమర్శిస్తున్నారు. కేంద్రం 2 ఏళ్ల క్రితమే పైలట్‌లు ఎలా ఉండాలో నిబంధనలు జారీచేసింది. అయితే ఇండిగో వాటిని అమలు చేయడంలేదు. అయినా ఇండిగో తగిన రీతిలో స్పందించక పోవడం వెనుక ఈ విమానయాన సంస్థ ఎవరితో అయినా కుమ్మక్కయిందా అన్న అనుమానాలు ఉన్నాయి. ఇదే అదునుగా మరో ఎయిర్‌లైన్స్ టాటా ఎయిర్ ఇండియా ప్రస్తుతం రూ.10వేలున్న టికెట్‌ను రూ.లక్ష చేసి వ్యాపారం చేసుకోవడం చూస్తే ప్రైవేట్ ఆధిపత్యం ఎంత ప్రమాదమో స్పష్టమౌతుఏందన్నారు. అందువల్ల దీనిని కేంద్రం సవాల్‌గా తీసుకోవాలి. మరిన్ని ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించాలి. అలాగే ఆయా సంస్థలకు రాయితీలు ప్రకటించాలి. విమాన ఇంధన ధరలను తగ్గించాలి. ఇలా చేయడం వల్ల ప్రజలకు ఉపయోగ పడడమే గాకుండా పెద్ద ఎత్తున నిరుద్యోగ సమస్య తీరగలదు. లేకుంటే మరిన్ని సంక్షోభాలను చవిచూడాల్సి ఉంటుంది. అవికూడా తట్టుకోలేనంతగా ఉండవచ్చు. ప్రభుత్వరంగం కూడా బలోపేతం కావాలి. లేకుంటే ప్రైవేట్ సంస్థలు కుమ్మక్కు అయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు.

# బలిదానాలు వద్దు.. పోరాడి రిజర్వేషన్ సాధించుకుందాం!




హైదరాబాద్,తెలంగాణ ఉద్యమం మన కళ్ల ముందు జ్వాలగా దహనమైంది. ప్రతి నినాదంలో ఆవేదన, ప్రతి అడుగులో ఆత్మగౌరవం ఉప్పొంగింది. ఉద్యమంలో వేలమంది యువత త్యాగాలు, కవులు, కళాకారులు రగిలించిన సాంస్కృతిక ఉప్పెన, ప్రజల అసమాన ఐక్యత అన్నీ కలిసి ఒక కొత్త రాష్ట్రాన్ని నిర్మించాయి. అయితే, దశాబ్దం తర్వాత కూడా అదే ప్రశ్న ముందుంది. స్వరాష్ట్రం నిజంగా అణగారిన వర్గాల కలలను నెరవేర్చిందా? లేక పాత అసమానతలకు కొత్త రూపం మాత్రమే వచ్చిందాప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కేవలం నీళ్లు, నిధులు, నియా మకాల డిమాండ్‌గా మొదలై, సబ్బండ వర్ణాల ఆత్మగౌరవ సమరంగా మారింది. ఆ పోరాటానికి తొలి నిప్పురవ్వ శ్రీకాంత చారి బలిదానం.. ఆ దృశ్యాన్ని, ఆ వేదనను మనం మర్చిపోలేం. ఆ త్యాగమే యావత్ తెలంగాణ సమాజాన్ని ఏకం చేసింది.

పదేళ్ల ప్రశ్నలు..

ఆనాటి ఉద్యమ లక్ష్యం భౌగోళిక సరిహద్దుల మార్పు మాత్రమే కాదు, తరతరాలుగా నిలిచిపోయిన సామాజిక న్యాయాన్ని, పాలనలో సంపూర్ణ భాగస్వామ్యాన్ని సాధించడం. అప్పుడు సాగరహారం, మిలియన్ మార్చ్ వంటి కార్యక్రమాలు పాలకుల గుండెల్లో గుబులు రేపాయి. సకల జనుల సమ్మెలో యావత్ తెలంగాణ సమాజం, ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు, కుల మతాలకు, పంథాలకు అతీతంగా ఏకమైంది. 1400 మందికి పైగా అమరులైయ్యారు. రాష్ట్రమంతా ఒక్కటై పోరాడితే రాష్ట్రం సిద్ధించింది. పదేళ్లు గడిచాయి.. మరి ఆ కల నెరవేరిందా? మన ప్రాణత్యాగాల ఫలితం ఏమైంది? సామాజిక న్యాయం జరిగిందా? ప్రస్తుతం రాష్ట్రంలో సామాజిక న్యాయం వెనక్కిపోయి, పాలనా పగ్గాలు మళ్లీ పాత పెత్తందారీ వర్గాల చేతిలో ఇరుక్కుపోయాయి. అందుకే, యువత తమ సొంత రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడాల్సిన దయనీయ దుస్థితి దాపురించిందా? ఈ ప్రశ్న ప్రతి తెలంగాణ బిడ్డను వెంటాడుతోంది.

సాయి ఈశ్వర్.. నేటి కన్నీటి సాక్ష్యం!

శ్రీకాంత చారి బలిదానం తెలంగాణకు తొలి పునాది వేస్తే, బీసీలకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, సాయి ఈశ్వర్ చారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించు కున్నాడు. బలిదానం తెలంగాణ పాలక వర్గాలు బీసీలకు చేసిన ఘోర అన్యాయానికి, వారి వంచనకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచిందని విమర్శకులు వాదిస్తున్నారు. ఉద్యమం ఏదైనా బలిదానంలో మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉంటారు. శ్రీకాంత చారి చరిత్రైతే, సాయి ఈశ్వర్ చారి నేటి కన్నీటి సాక్ష్యం. అణగారిన ఆత్మగౌరవాన్ని పాలక వర్గాలు మళ్లీ మళ్లీ కించపరుస్తున్నారని సామజిక వాదులు ఆరో పిస్తున్నారు. తెలంగాణ జనాభాలో బీసీలు 50 నుంచి 60 శాతం వరకు ఉన్నారు. ఇంతటి సంఖ్యా బలం ఉన్న వర్గానికి రాజ్యాధికారంలో తగిన వాటా దక్కడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా వాటా బడ్జెట్‌లో, రాజకీయ నిర్ణయాల్లో, పాలనా నిర్ణయాల్లో, ఆ వాటాలో ప్రతిబింబించడం లేదు.

రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడంతో..

అసలు సమస్య ఎక్కడ మొదలైందంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం జీవో 9 జారీ చేసినప్పటికీ, హైకోర్టు దానిపై స్టే విధించింది. బీసీలకు రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కావడం, బీసీలకు రిజర్వేషన్లు అవసరమని న్యాయస్థానం ముందు నిరూపించడానికి అవసరమైన బలమైన చట్టపరమైన ఆధారాన్ని (డేటా) రూపొందిం చడంలో విఫలమవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వానికి పరాజయం తప్పలేదు. ఇది ప్రభుత్వం కోరి తెచ్చుకున్న సమస్య. స్పష్టమైన రాజకీయ చిత్తశుద్ధి లేమి, న్యాయపరమైన వైఫల్యం, రాజకీయ అధికారం తమ చేతిలో లేకపోతే చట్టబద్ధమైన హక్కులు సైతం నిలబడవనే చేదు సత్యాన్ని నిరూపించింది. బీసీలకు 42% కాదు, వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా 60% రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ ఈ రాజకీయ బలహీనత నుండే పుట్టింది.

రాజ్యాధికారమే ఏకైక మార్గం!

అమరుల త్యాగాలు మనకు నిరాశను పంచడానికి కాదు. అవి మనలో పోరాట స్ఫూర్తిని రగిలించడానికి.. శ్రీకాంత చారి, సాయి ఈశ్వర్ చారిల బలిదానాలు ఒకటే విషయాన్ని బల్లగుద్ది చెబుతున్నాయి. రాజ్యాధికారంలో తగిన వాటా లేకపోతే, అన్యాయం ఆగదు. పాలనా పీఠంపై కూర్చోకపోతే, బడ్జెట్ కేటాయింపులపై, విద్య, వైద్య, ఉద్యోగ విధానాలపై మనకు ఎలాంటి నియంత్రణా ఉండదు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు జనాభాలో అత్య ధికంగా ఉన్నప్పటికీ, వారి మధ్య ఉన్న చిన్నపాటి విభేదాల కారణంగానే పాలనాధికారం కేవలం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైంది. పాలకుల కుట్రను దహనం చేయాలంటే ఐక్యత అనే అస్త్రంతో పోరాడాలి. అందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీలందరూ ఏకం అవ్వడం తప్ప మరో మార్గం లేదు. బలిదానాలు వద్దు. రాజకీయ అధికార యుద్ధం చేయాలి. వెనకబడిన వర్గాల వారు కేవలం ఓటర్లుగా మిగిలిపో కూడదు. న్యాయం కోసం దేవులాడే యాచకులుగా ఉండకూడదు. చట్టాలను రాసే శాసన కర్తలుగా మారాలి, రాజ్యాధికారాన్ని స్థాపించుకోవాలి.

ఈ నినాదంతో ముందుకు వెళదాం..

ఉద్యమ వారసత్వాన్ని, వేలమంది అమరుల ఆకాంక్షలను నిజం చేసే శక్తి, సామాజిక న్యాయాన్ని స్థాపించే శక్తి, కేవలం అధికార పీఠానికే ఉంది. నువ్వే పాలకుడివి కావాలి. చట్టాలను నువ్వే రాసుకోవాలి. అధికారం సాధించినప్పుడే, అణగారిన వర్గాలకు న్యాయం వెల్లివిరిసినప్పుడే ఈ పోరాటం ఆగాలి. ఏకమై, లక్ష్యం వైపు ఉరకాలి. సరైన సమయం ఇదే. 'మన శాసనం మనమే రాసుకుందాం అనే నినాదం'తో ముందుకు సాగాలి. ఓటే ఆయుధం రాజ్యాధికారమే ఏకైక మార్గం, చివరి లక్ష్యం కావాలి.

# ఇండిగో సంక్షోభం కారణంగా ఇప్పుడు దేశం మొత్తం పబ్లిక్ రంగం ప్రాధాన్యతపై చర్చ




న్యూఢిల్లీ,ఇండిగో సంక్షోభం కారణంగా ఇప్పుడు దేశం మొత్తం పబ్లిక్ రంగం ప్రాధాన్యతపై చర్చ మొదలైంది. వేలాదిమంది సోషల్ మీడియాలో పబ్లిక్ రంగం పాత్ర ఈ దేశ విమానయాన రంగంలో షోషించిన నిర్మాణాత్మక పాత్రపై అనేక చర్చలు జరుగుతున్నాయి. పబ్లిక్ రంగం పాత్రను చరిత్రలోనే మనం తొంగిచూస్తే అనేక విజయాలు మనకు కనిపిస్తాయి. భారత దేశంలో పబ్లిక్ రంగం అనేది సాధారణ ఆర్థిక వ్యవస్థలో ఒక రంగం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యపు సామాజిక, ఆర్థిక బలాన్ని నిలబెట్టే స్తంభం. స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశం సమగ్ర అభివృద్ధి సాధించాలంటే ప్రజల అవసరాలను కేంద్రంగా పెట్టుకున్న ఆర్థిక నిర్మాణం అవసరమైంది. అదే బాధ్యతను పబ్లిక్ రంగం నెరవేర్చింది. బ్యాంకింగ్ నుంచి రైల్వేలు, విమానయానం, కోల్ ఇండియా నుంచి స్టీల్ అథారిటీ వరకు, కోట్లాది ప్రజల ప్రయాణాలు, పొదుపులు, ఉపాధి, జీవన ప్రమాణాలు పబ్లిక్ రంగాలపై ఆధారపడి ఉన్న వాస్తవం. లాభాలను కంటే ప్రజల అవసరాలను ముందుకు పెట్టడం, దూరప్రాంతాలకు సేవలు చేర్చడం, సామాజిక సమానత్వాన్ని చూపించడం ఇవన్నీ పబ్లిక్ రంగం నుంచే సాధ్యమయ్యాయి.కానీ నేడు ఈ రంగం దాడులు పెరుగుతున్నాయి. ప్రైవేటీకరణను అభివృద్ధి అని అమ్మే ప్రభుత్వాలు పబ్లిక్‌రంగ సంస్థలను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నాయి. లాభాల్లో ఉన్న సంస్థలకూ 'స్ట్రాటజిక్ డిస్‌ఇన్వెస్ట్‌మెంట్' పేరుతో వేలం వేయడం సాధారణమైంది. ప్రజల సొమ్ముతో నిర్మించిన సంస్థలను కొంతమంది కార్పొరేట్ వర్గాలకు అప్పగించడం ద్వారా ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థను క్రిమినలైజ్ చేస్తున్నాయి. బ్యాంకులను విలీనాలు, మూసివేతల దిశగా నెట్టడం, బొగ్గు బ్లాకులను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం, రైల్వే, ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలను విడదీసి ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టడం ఇవన్నీ ప్రజలపై భారాలు మోపే నిర్ణయాలే. ప్రైవేటు రంగం లాభాలను మాత్రమే చూసే క్రమంలో సామాజిక బాధ్యతలు, ధర నియంత్రణ, గ్రామీణ సేవలు అన్నీ అరుదైపోయే ప్రమాదం ఉంది. భారతదేశం లాంటి అసమానతలున్న దేశంలో పబ్లిక్‌రంగం కేవలం వ్యాపారం కాదు. అది సామాజిక సమీకరణ యంత్రాంగం.లాభాలు లేకున్నా సేవలను విరమించకుండా కొనసాగించగల రంగం ఇదొక్కటే.ప్రైవేటీకరణ పేరుతో పబ్లిక్ రంగాన్ని ముసుగులో హరించడం నేరం. ఒక తరానికి చెందిన సొమ్ము, శ్రమ, కలలతో నిర్మించిన ఈ ఆస్తులు దేశ భవిష్యత్తుకు కేవలం పెట్టుబడులు కాదు, రక్షణ. ప్రస్తుత అసమానతలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో పబ్లిక్ రంగం బలోపేతం అత్యవసరం. ఉపాధి తగ్గిపోతున్న సమయంలో పబ్లిక్ రంగ విస్తరణ తప్ప మరే ప్రత్యామ్నాయం లేదు. చిన్న, పెద్ద, మధ్యతరగతి ప్రజలందరూ ఆధారపడే భద్రతా వల ఈ రంగమే. కాబట్టి పబ్లిక్ రంగాన్ని రక్షించడం అనేది కేవలం గతాన్ని కాపాడడం కాదు, భవిష్యత్తును కాపాడడం. కానీ పాలకులు ప్రజలకంటే, దేశం అవసరాల కంటే పెట్టుబడి దారుల అవసరాలే మిన్నగా ఉంటున్నాయి. అందుకు ఉదాహరణే ఈ ఇండిగో సంక్షోభం అన్నది వాస్తవం. ఇండిగోలో ఇటీవలే బయటపడిన యాజమాన్య, వాటాదారుల మధ్య అధికార పోరు దేశ విమానయాన రంగం ఎంత అస్థిరంగా మారిందో ప్రత్యక్షంగా చూపిస్తున్న సంఘటన. మార్కెట్‌లో 60 శాతానికి పైగా వాటా ఉన్న సంస్థ ఒక్కరోజు అంతర్గత ఒడిదుడుకులకు లోనైతే దేశవ్యాప్తంగా వేలాది ఫ్లైట్లు రద్దయ్యే ప్రమాదం, ప్రయాణికులు ఇరుక్కుపోయే పరిస్థితి, షేర్ మార్కెట్‌లో కోట్లు ఆవిరయ్యే అనిశ్చితి, ఇవి అన్నీ ఒక్కసారిగా వెల్లువెత్తాయి. ఇది కేవలం ఒక కంపెనీ గొడవ కాదుబీ ఇది విమానయాన రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించిన ప్రభుత్వ విధానాల ఘోర వైఫల్యం.ఆ వైఫల్యాన్ని ప్రశ్నించే ఆలోచనే పాలకవర్గానికిలేదు. ఎయిర్ ఇండియాను భారాలు అవుతున్న పబ్లిక్ రంగం అని తక్కువ చేసి, నష్టాలను ఉద్దేశపూర్వకంగా పెంచిన తరువాత అతి తక్కువ ధరకు ప్రైవేటు చేతుల్లో వదిలేసిన ప్రభుత్వం ఇప్పుడు ఇండిగో సంక్షోభం గురించి పెదవి విప్పడానికి కూడా ముందుకు రావడం లేదు. ఒక పబ్లిక్‌రంగ విమానయాన సంస్థ పనిచేసేది కేవలం లాభాల కోసం కాదుబీ అది జాతీయ అవసరాలను తీర్చే బాధ్యతను కూడా మోసేది. దూరప్రాంతాలకూ, లాభం రానివాటికీ సేవలందించేది. అత్యవసర సమయాల్లో విదేశాల్లో ఇరుక్కున్న భారతీయులను కొలువరించేది. విపత్తుల సమయంలో రక్షణ చర్యల్లో పాల్గొనేది. ఇవన్నీ ప్రైవేట్ రంగం చేయగలదా? వారి బోర్డు సమావేశాల్లో వాటాదారుల ఒత్తిడి ఒక మూలను ఇరుకోబెడితే, ఆ రాత్రే ధరలు ఎగసిపడతాయిబీసేవలు నిలిచిపోతాయి.ఇండిగో సంక్షోభం తర్వాత మార్కెట్ ఎలా స్పందించిందో చూస్తే భారత గగనయాన రంగం అనిశ్చితి ఎంత తీవ్రమో అర్థమవుతుంది.షేర్ ధర పతనంతో పెట్టుబడిదారులు ఆందోళన చెందినా, సాధారణ ప్రజల సమస్య మాత్రం మరింత సూటిగా మెదులుతుంది. ప్రయాణ ఖర్చులు పెరగటం, టికెట్లు అకస్మాత్తుగా దొరక్కపోవటం, సేవా నాణ్యత పడిపోవడం, మార్గాల ఎంపిక పూర్తిగా సంస్థల ఖజాన, లాభాల లెక్కల ఆధారంగా నిర్ణయించబడటం. విమాన యాన రంగం లాంటి కీలక రంగాన్ని పూర్తిగా ప్రైవేటుకు అప్పగించడం ఒక దేశ భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి ముప్పే. విమాన రూట్ల కేటాయింపు, అత్యవసర ఎయిర్‌లిఫ్ట్‌లు, అభివృద్ధి చెందని ప్రాంతాలకు కనెక్టివిటీ వంటి సేవలను ప్రైవేట్ కంపెనీలు తమ బ్యాలెన్స్ షీట్‌లను చూసుకుని మాత్రమే నిర్వహిస్తాయి.అలా లాభం రాకపోతే, ఆ సేవలు నిలిచిపోతాయి. పబ్లిక్ రంగం ఉన్నప్పుడు మాత్రం లాభ–నష్టాలతో సంబంధం లేకుండా ప్రజా ప్రయోజనాలే కేంద్రంగా నిలిచేవి. ఇది పబ్లిక్ రంగం ప్రాధాన్యతను సాక్ష్యాలతో రుజువు చేసే ముఖ్యమైన ఉదాహరణ. ఇండిగోలో జరిగిన మేనేజ్‌మెంట్ విభేదాలు, వాటాదారుల మధ్య అధికార యుద్ధాలు, అంతర్గత చెత్త పాలన దేశ విమానయాన రంగంలో ఒకే సంస్థ ఆధీనత ఎలా ప్రమాదకారకమో చూపుతున్నాయి. ప్రైవేట్ సంస్థల అప్రతిహత అధికారం, ప్రభుత్వ మౌన సమ్మతి రెండూ కలిపి ప్రజలకే భారమయ్యా యి. ఒక సంస్థ గందరగోళం కారణంగా దేశవ్యాప్తంగా వందల ఫ్లైట్లు ఆలస్యం కావటం అంటే, కొద్దిమంది పెట్టుబడిదారుల మీద దేశం మొత్తం ఆధారపడి ఉన్నదని అర్థం. ఇది అస్వాభావికమైన ఆర్థిక నిర్మాణం. ఇండిగో సంక్షోభం ఒక సంఘటన కాదు, అది ఒక సందేశం. దేశ విమానయాన రంగాన్ని పూర్తిగా ప్రైవేటు ఆధీనానికి అప్పగించినప్పుడు ఏమి జరుగుతుందో ఇది స్పష్టంగా చెబుతోంది. పబ్లిక్ రంగం మరింత బలపడాల్సిన అవసరం ఉంది. విమానయానాన్ని ప్రజా సేవగా తిరిగి నిర్వచించాల్సిన సమయం వచ్చింది. అప్పుడే ప్రజల ప్రయాణం సురక్షితం, అందుబాటు, సమానత్వం కలిగినదిగా ఉంటుంది.

### సిద్దరామయ్య ఎన్నికపై సవాల్

న్యూఢిల్లీ,కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది . 2023లో వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ కె శంకర అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని సిద్ధరామయ్యను ఆదేశిస్తూ కోర్టు ఇవాళ నోటీసులు జారీచేసింది.కాగా 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధన ప్రకారం సిద్ధరామయ్య అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, వరుణ అసెంబ్లీ

# ఇండిగో వ్యవహారంలో సమర్థంగా రామ్మోహన్ పనితీరు

న్యూఢిల్లీ, ఇండిగో వ్యవహారంలో ప్రయాణికులకు మేలు జరిగేలా చర్యలు తీసుకున్నారని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ప్రధాని మోదీ కితాబిచ్చారు. శాఖాపరంగా సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారని ప్రశంసించారు. విమర్శలు పట్టించుకోకుండా ముందుకెళ్లాలని సూచించారు. ఇండిగో వ్యవహారంపై మంత్రి రామ్మోహన్‌నాయుడు.. ఎప్పటికప్పుడు ప్రధాని కార్యాలయానికి సమాచారం పంపినట్లు తెలిసింది.ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను నవంబర్ 1 నుంచి అమలు చేస్తున్నట్లు డీజీసీఏకు, పౌరవిమానయాన శాఖకు ఇండిగో సమాచారం ఇచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 1 వరకు కార్యకలాపాలన్నీ సజావుగానే ఉన్నాయని, డిసెంబర్ 3 నుంచి సమస్యలు వచ్చాయని అన్నారు. ఇది పూర్తిగా యాజమాన్య తప్పిదమేనని, కచ్చితంగా ఆ సంస్థపై చర్యలు ఉంటాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇండిగో వద్ద 2260 మంది పైలట్లు ఉన్నారని అధికారులు చెబుతున్నారు. షోకాజ్ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ గడువు కోరారని, ఆయన నుంచి సమాధానం వచ్చాక తదుపరి చర్యలు మొదలవుతాయని అధికారులు అంటున్నారు. ఇండిగో విమానాల వ్యవహారంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు సోమవారం రాజ్యసభలో వివరణ ఇచ్చారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇండిగో వ్యవహారంలో రాజ్యసభలో రామ్మోహన్ నాయుడు ఇచ్చిన సమాధానంపై ప్రధాని మోదీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇండిగో అంశంలో ప్రయాణికులకు మేలు జరిగేలా.. సమయస్ఫూర్తితో చర్యలు తీసుకున్నారంటూ మంత్రి రామ్మోహన్ నాయుడిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఈ వ్యవహారం లో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వైపు నుంచి ఎలాంటి లోటు పాట్లు లేకుండా.. సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారని మంత్రి రామోహ్మన్ నాయుడితో ప్రధాని మోదీ పేర్కొన్నట్లు సమాచారం. ఇది పూర్తిగా ఇండిగో యాజమాన్య వైఫల్యమని.. కానీ కొంత మంది తెలిసీ తెలియక చేస్తున్న విమర్శలను పట్టించుకోకుండా ముందుకు వెళ్లాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అలాగే హోంమంత్రి అమిత్ షా సైతం ఫోన్ చేసి పరిస్థితి ఆరా తీసినట్లు తెలుస్తోంది.ఒకేసారి విమాన కార్యకలాపాల్లో సమస్య వచ్చిందని... ఇది పూర్తిగా యాజమాన్య తప్పిదమని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అదీకాక ఈ సమస్య ఉత్పన్నమైనప్పుడు ఇండిగో యాజమాన్యంలోని పలువురు కీలక వ్యక్తులు విదేశాల్లో ఉన్నారని అధికార వర్గాలు ఈ సందర్భంగా స్పష్టం చేశాయి. ప్రయాణీకులకు చుక్కలు చూపించిన ఇండిగోపై తప్పకుండా చర్యలు ఉంటాయని.. అయితే అంతకుముందు తీసుకోవాల్సిన అంశాలపై పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 2వ తేదీ అర్ధరాత్రి వరకు సాధారణంగానే ఉన్న వ్యవస్థ... ఒక్కసారిగా కుప్పకూలడానికి గల కారణాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు వివరించాయి. ఇండిగో సంస్థలోనే అత్యధికంగా 2,260 మంది పైలెట్లు ఉన్నారని చెప్పాయి. దేశంలో పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవడానికి ఇండిగో ఎయిర్ బస్ నుంచి 100 విమానాలు కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చిందని అధికార వర్గాలు వివరించాయి. ఎయిర్ ఇండియా 500, ఆకాశ 100, స్పైస్ జెట్ 50 విమానాలు కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చాయని తెలిపాయి.

# స్క్రబ్ టైఫస్ వల్ల వెంటనే ఎవరు మరణించరు

అమరావతి,స్క్రబ్ టైఫస్ వల్ల వెంటనే ఎవరు మరణించరని.. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్ స్పష్టం చేశారు. ఈ స్క్రబ్ టైఫస్‌పై ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది 1,566 స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు వచ్చాయని చెప్పారు. గతేడాది 1,613 కేసులు వచ్చాయని వివరించారు. ఈ స్క్రబ్ టైఫస్ ఈ ఏడాది వచ్చినట్లుగా భావించవద్దని ప్రజలకు ఆయన సూచించారు. సోమవారం అమరావతిలో కమిషనర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ.. ఈ వ్యాధి ఎవరికి తెలియనిది కాదన్నారు. మలేరియా, డెంగీలాగా స్క్రబ్ టైఫస్ వస్తుందన్నారు. ప్రతీ ఏడాది 1,300 స్క్రబ్ టైఫస్ కేసులు వస్తున్నాయంటూ ఆయన గణాంకాలతో సహా సోదాహరణగా వివరించారు. ఇప్పటి వరకూ ఈ స్క్రబ్ టైఫస్ వల్ల 9 మంది మరణించినట్లు గుర్తించామని చెప్పారు. దీనిపై ఎక్స్‌పర్ట్ జార్జితో సైతం ఇప్పటికే మాట్లాడామన్నారు. దీనిని అజిత్రోమైసిన్, డాక్సిసైక్లిన్‌లతో తగ్గించుకో వచ్చని సూచించారు. ఇప్పటి వరకూ నమోదైన మరణాలు స్క్రబ్ టైఫస్ వల్ల మాత్రమే కాదని.. ఆల్రెడీ వ్యాధి ఉండి, ఇది వచ్చాక మరణించిన కేసులు ఇవన్నీ అని కమిషనర్ వీరపాండ్యన్ వివరించారు. కర్ణాటకలో గత ఏడాది 1,689 స్క్రబ్ టైఫస్ కేసులు.. ఈ ఏడాది 1,870 కేసులు వచ్చాయన్నారు. అలాగే తమిళనాడులో గతేడాది 6,925 స్క్రబ్ టైఫస్ కేసులు.. ఈ ఏడాది 7,380 కేసులు వచ్చాయని తెలిపారు. తెలంగాణలో గతేడాది 309.. ఈ ఏడాది 183 కేసులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుత్రుల్లో స్క్రబ్ టైఫస్‌కు ట్రీట్‌మెంట్ ఉందని స్పష్టం చేశారు. జ్వరం వచ్చిన 5వ రోజు నుంచీ 20వ రోజు మధ్యలో స్క్రబ్ టైఫస్ బయట పడుతోందన్నారు. గుంటూరు, విజయవాడలలో జినోమ్ ల్యాబ్‌లను యాక్టివేట్ చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ, గ్రామీణ విభాగాలను సైతం అప్రమత్తం చేశామని చెప్పారు. ఇక ప్రతీ జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ఉంటుందన్నారు. దీనిపై ప్రతీ వారం సమావేశం నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఇప్పటికే ఆదేశించామని చెప్పారు. పోర్టల్‌లో ప్రతీ కేసు ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని వారికి స్పష్టం చేశామన్నారు. పారిశుద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని ఆయన చెప్పారు. స్క్రబ్ టైఫస్ వార్డులో ఉన్న 12 మందిలో ఆరుగురు ఐసీయూలో ఉన్నారని గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ వివరించారు. అయితే గతంలో వ్యాధులు ఉన్నా వారు ఆలస్యంగా ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు. ఒక యువతికి డైరెక్ట్‌గా బ్రెయిన్‌కు వచ్చింది డాక్టర్ రమణ వివరించారు.

### గోదావరిలో తప్పిన ప్రమాదం

కోనసీమ,డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సఖినేటిపల్లి – పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మధ్య వశిష్ఠ గోదావరిలో ప్రయాణికులను చేరవేసే పంటు సాంకేతిక లోపంతో నది మధ్యలో నిలిచిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వందమందికి పైగా ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. రెండు జిల్లాలకు చెందిన వేలమంది నిత్యం వీటిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం నరసాపురం నుంచి సఖినేటిపల్లి వైపు ప్రయాణికులను ఎక్కించుకుని పంటు బయలుదేరింది. గోదావరి మధ్యకు రాగానే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆగిపోయింది. బాగుచేయడానికి ప్రయత్నించినా ఫలించలేదు. అదే సమయంలో నదిలో ప్రవాహవేగం ఎక్కువగా ఉంది. దీంతో పంటు అంతర్వేది సాగర సంగమం వైపు వెళ్లిపోసాగింది. నిర్వాహకులు అప్రమత్తమై మరో పంటు సాయంతో ఒడ్డుకు చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రధానికి సర్దిచెప్పిన సౌగత్ రాయ్

న్యూఢిల్లీ, వందేమాతరం పై చర్చ సందర్భంగా పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగా ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీని ప్రధాని బంకిం దా అని పలుమార్లు సంబోధించారు. అదే సమయంలో తృణమూల్ ఎంపీ సౌగత్ రాయ్ ప్రధాని 'దా' అని సంబోధించడంపై అభ్యంతరం చెప్పారు. సోదరుడు అనే సంబోధించేందుకు బెంగాలీ భాషలో 'దా' అని వాడతారు.. సాంస్కృతిక దిగ్గజానికి అటువంటి పదం వాడటం సరికాదని పేర్కొన్నారు. 'బంకిం బాబు' అని ప్రధాని సంబోధించాలని సూచించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రధాని వెంటనే స్పందించారు. ఇకనుంచి బంకిం బాబు అనే సంబోధిస్తానని వెల్లడించారు. తన పొరబాటును సరిచేసినందుకు సౌగత్‌రాయ్‌కు ధన్యవాదాలు చెబుతూ.. నేను మిమ్మల్ని దాదా అని సంబోధించవచ్చా..? లేదా దానిపై కూడా ఏమైనా అభ్యంతరాలున్నాయా..? అని సరదాగా ప్రశ్నించారు. సోమవారం నాటి చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ పాల్గొనలేదు. దీంతో ఎంపీ గౌరవ్ గొగొయ్ ప్రతిపక్షాల తరఫున చర్చను ప్రారంభించారు. అయితే రాహుల్ గైర్హాజరు కావడాన్ని భాజపా నేత సీఆర్ కేశవన్ తప్పుపట్టారు.

## వేదకాలం నుంచి మాతను కొలవడం ఆదర్శం

న్యూఢిల్లీ,దేశ స్వాతంత్ర్యానికి వందేమాతర గీతం ప్రేరణ అని ప్రధాని మోదీ అన్నారు. కోట్లాది మంది భారతీయులు ఈ గీతానికి ఉత్తేజితులై స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారని అన్నారు. ఇది దేశానికి ప్రేరణ ఇచ్చిన గీతమని, స్వాతంత్ర్య సముపార్జనకు నాందిగా మారిందని అన్నారు. లోక్‌సభలో వందేమాతర గీతం 150వ వార్షికోత్సవంపై జరిగిన చర్చలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ చర్చ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. బంకించంద్ర ఛటోపాధ్యాయ రాసిన వందేమాతర గీతం బెంగాల్‌లో బాగా ప్రాచుర్యం అయినట్లు మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా వార పత్రిక 'ఇండియన్ ఒపీనియన్'లో డిసెంబర్ 2, 1905న రాశారు. బెంగాల్ స్వదేశీ ఉద్యమ సమయంలో బంకించంద్ర రాసిన పాటను పాడటానికి లక్షలాది మంది ప్రజలు గుమిగూడి భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ పాట ఎంతగా ప్రాచుర్యం పొందింది అంటే.. ఈ గీతమే మన జాతీయ గీతంగా మారింది. ఈ పాట భావాలు గొప్పవి. ఇది ఇతర దేశాల పాటల కంటే తియ్యగా ఉంటుంది. దేశభక్తిని మేల్కొల్పడం దీని ఏకైక లక్ష్యం. ఇది భారతదేశాన్ని తల్లిగా చూస్తుంది' అని అన్నారు. రుగ్వేదంలోని శ్లోకాన్ని ప్రస్తావిస్తూ రాముడు పలికిన వాక్యాలను ఈ సందర్భంగా ప్రధాని మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. దేశమంటే మన మాతృభూమిగా కొలవడం అనాదిగా వస్తోందని, వందేమాతర గీతానికి ఇదే ప్రేరణ అని అన్నారు. లోక్‌సభలో వందేమాతరంపై జరుగుతున్న ప్రత్యేక చర్చ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ గతంలో జాతీయ గీతాన్ని 'తుకే తుకే' చేసినట్టు ఆరోపించారు. అలాగే, వందేమాతరంతో ముస్లింలను రెచ్చగొట్టే విధంగా ఉందని నెహ్రూ పేర్కొన్నాడని చెప్పారు. సభలో 'షేమ్ షేమ్' నినాదాలు వినిపించినప్పటికీ, మోదీ వ్యాఖ్యానిస్తూ.. గత శతాబ్దంలో కొన్ని శక్తులు జాతీయ గీతానికి సర్వనాశనం చేశాయని పేర్కొన్నారు. ఆ చరిత్రను వచ్చే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనదేనని ప్రధాని మోదీ అన్నారు. 1937లో మహమ్మద్ అలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్ వందేమాతరానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. అయితే, కాంగ్రెస్, నెహ్రూలు ఆ పోరాటాన్ని ఎదిరించ కుండా, వందేమాతరం పై విచారణకు ఆదేశాలు జారీ చేశారని విమర్శించారు. జిన్నా ఆందోళన తరువాత సుభాష్ చంద్ర బోస్‌కు నెహ్రూ రాసిన లేఖలో- వందేమాతరం మొత్తం చదివిన తరువాత అది ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందని భావిస్తున్నానని ఆయన వెల్లడించారు. అలాగే, అత్యవసర పరిస్థితి కాలాన్ని గుర్తు చేసుకుంటూ.. వందేమాతరం 50 సంవత్సరాలు పూర్తయ్యే సమయానికి దేశం మొత్తం బ్రిటిష్ వారి పాలనలో ఉందని.. 100 ఏళ్లు పూర్తి అయ్యే సమయానికి దేశంలో అత్యవసర పరిస్థితి దేశాన్ని కబళించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను జైలులో పెట్టిన ఆ కాలం భారత చరిత్రలో బ్లాక్ డేస్ గుర్తించబడిందని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. అయితే, వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆ గీతానికి గౌరవం తిరిగి తీసుకురావాల్సిన సమయం ఇదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 1875లో బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ రచించిన ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిగా నిలిచిందని ప్రశంసించారు. వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభల్లో 10 గంటల ప్రత్యేక చర్చను ఏర్పాటు చేసింది.

### దుర్గామాతపై చరణాలు తొలగించిన నెహ్రూ

న్యూఢిల్లీ,స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన వందేమాతరం గేయానికి ఎట్టకేలకు గుర్తింపు వచ్చిందని, ఆ గేయం జాతికి గర్వకారణం అని, కానీ ఆ గేయంలో ఉన్న దుర్గామాత చరణాలను కాంగ్రెస్ పార్టీ తొలగించిందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ అన్నారు. లోక్‌సభలో వందేమాతరం గేయం గురించి చర్చ జరిగింది. ఆ చర్చలో ప్రధాని మోదీ మాట్లాడుతూ వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ ముక్కలు చేసినట్లు ఆరోపించారు. ఆ అంశం గురించి ఎంపీ కంగనా రనౌత్ స్పందించారు. పార్లమెంట్ ఆవరణలో రిపోర్టర్లతో ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామంలో నడిపించిన గీతానికి ఇప్పుడు క్రెడిట్ దక్కడం గర్వకారణం అన్నారు. ఆ గేయంలోని దుర్గామాత చరణాలను తొలగించారని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళా వ్యతిరేకి అని ఆమె ఆరోపించారు. వందేమాతం గీతంలో ఉన్న దుర్గాదేవి చరణాలను 1937లో తొలగించినట్లు ఇటీవల బీజేపీ నేత సీఆర్ కేశవన్ పేర్కొన్నారు. కొన్ని వర్గాల ప్రజలను సంతోష పెట్టేందుకు నెహ్రూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆ గేయంలో ఉన్న తొలి రెండు చరణాలను మాత్రమే కాంగ్రెస్ పార్టీ ఆమోదించిందన్నారు. దీంతో ఆ గీతంపై ఇప్పుడు కొత్తగా చర్చ మొదలైంది. వందేమాతం గీతం గురించి ఎన్నో ఏళ్లుగా చర్చ సాగుతోందని,ఆ పాట గురించి అందరికీ సాధికారం, మన సంస్కృతి, సంప్రదాయం,చరిత్ర గురించి తెలుసుకోవాలని బీజేపీ ఎంపీ అరుణ్ అన్నారు.

### యువతిని హత్య చేసిన దుండగుడు

హైదరాబాద్,హైదరాబాద్ ముషీరాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. పెళ్లికి ఒప్పుకోవడం లేదని ఓ యువతిని ఆమె తల్లి ముందే దుర్మార్గుడు కిరాతకంగా హత్య చేసి పారిపోయాడు.వారాసిగూడ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ ఇంటర్ విద్యార్థిని (18) దారుణ హత్యకు గురైంది. మేనమామ వరసయ్యే యువకుడు యువతి తల్లి కళ్లముందే కత్తితో ఆమె గొంతు కోసి హత్య చేశాడు. ఈ దారుణానికి పాల్పడిన యువకుడు.. ఘటనాస్థలిలోనే కత్తి, సెల్‌ఫోన్ వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వారాసిగూడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఇటీవల ఆ ఇద్దరు యువతీయువకులకు పెద్దలు పెళ్లి నిశ్చయించారు. ఆ తర్వాత వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. తన మాట లెక్కచేయలేదని కోపం పెంచుకున్న యువకుడు.. మాట్లాడదామనంటూ ఇంటికి వచ్చి.. ఆమె తల్లి ముందే గొంతుకోసి పరారయ్యాడు. క్లూస్ టీం, పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# అక్రమ బహిష్కరణలు ఆగేదెన్నడు?



న్యూఢిల్లీ,బంగ్లాదేశ్‌లో ఆరు నెలల నిర్బంధం తర్వాత 25 ఏళ్ల సునాలి ఖాతుర్ మాల్దాలోకి అడుగుపెట్టింది. ఇది కొంత ఉపశమనం కలిగించినా, సామూహిక అవమానంగా భావించి ఉండాలి. ఆమె అక్రమ వలసదారు కాదు, చొరబాటుదారు కాదు. వీసా గడువు ముగిసినా మన దేశంలో ఉంటున్న విదేశీ పౌరురాలు కాదు. అమె పశ్చిమ బెంగాల్‌కు చెందిన స్త్రీ, గర్భిణి. చిన్న కొడుకుతో ప్రయాణిస్తున్నప్పుడు ఎలాంటి న్యాయపరమైన అనుమతి లేకుండా భారతీయ అధికారులు బలవంతంగా అంతర్జాతీయ సరిహద్దులను దాటించారు. న్యాయవాదులు, వలసహక్కు సంఘాల జోక్యం, ఆమె కేసు కోర్టు ముందుకు తెచ్చేందుకు చేసిన యత్నాల పుణ్యమా అని ఆమె తిరిగి రావడం సాధ్యమైంది. దీనిపై ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ చట్టాల గురించి అస్పష్ట సూచనలు తప్ప ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఆ సూచనలు కూడా సరైన ప్రక్రియ లేకుండా భారతీయ పౌరులను మరో దేశానికి నెట్టివేయడాన్ని ఏమాత్రం సమర్థించవు. సునాలీకి ఎదురైన కఠిన పరీక్ష చిత్రం ఏమీ కాదు. అసోం, చుట్టుపక్కల జిల్లాలనుంచి వచ్చిన పేద బెంగాలీ మాట్లాడే ముస్లింలను అనుమానిత అక్రమ వలసదారులుగా ముద్రవేసి, చట్టబద్ధమైన బహిష్కరణలకు బదులుగా రహస్యంగా బహిష్కరణ మాదిరిగా సరిహద్దుల నుంచి నెట్టివేయబడుతున్న ఎన్నో కేసులలో ఇది ఒకటి. కేసు తర్వాత.. బంగ్లాదేశ్ ఈ వ్యక్తులను తమ పౌరులుగా అంగీకరించేందుకు నిరాకరించడం, వారు బంగ్లాదేశ్ జాతీయులు కాదని నొక్కి చెప్పి భారతదేశానికి తిరిగి పంపడం మామూలయింది.పదేపదే ఇలా పలువురు తిరిగి రావడం పలు ప్రశ్నలకు దారితీస్తున్నది. బంగ్లాదేశ్ వారిని కోరుకోకపోతే, భారతదేశం వారిని గుర్తించడానికి నిరాకరిస్తే, వారి చట్టబద్ధమైన, మానవ పరమైన హోదా ఏమిటి? ఏ ప్రభుత్వం తమ సొంత పౌరులను భౌతికంగా తొలగించి, వదిలి వేయాల్సినంతగా భారంగా భావిస్తుంది. 2025 మే లో అసోంకు చెందిన ఇద్దరు మహిళలు –సోనా భాను, రహిమా బేగం– ను వారి ఇళ్లనుంచి తీసుకెళ్లి మిలిటరీ జోన్ మీదుగా తరలించి, భారతదేశం బంగ్లాదేశ్ మధ్య ఉన్న నో మ్యాన్ లాండ్ –నిర్జన ప్రదేశంలో వదిలి వేశారు. వారికి తిండిలేదు. నిలువ నీడలేకుండా కొన్నిరోజుల తరబడి బయటపడ్డారు. బంగ్లాదేశ్ అధికారులను వారిని తిరిగి తీసుకువచ్చి సరిహద్దు గార్డులకు అప్పగిస్తే, వారి నుంచి వేధింపులు భరించాల్సి వచ్చింది. అదే సమయంలో మాజీ పాఠశాల టీచర్ బైరుల్ ఇస్లాంను సుప్రీం కోర్టులో అప్పీలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, బంగ్లాదేశ్‌కు బలవంతంగా తరలించారు. చాలా కాలం క్రితం డి– ఓటరుగా గుర్తించబడిన హజేరా ఖాతున్ అనే వృద్ధ మహిళను ఇదే విధంగా బహిష్కరించారు. బంగ్లాదేశ్ ఆమెను తమ దేశంలో చేర్చుకోవడానికి నిరాకరించే వరకూ ఆమె తనను తాను రక్షించుకుంటూ బతకాల్సివచ్చింది.ఇవి చట్టపరమైన బహిష్కరణలు కావు. అవి భారత చట్టం ప్రకారం అవసరమైన డాక్యుమెంట్లు, విచారమలు, పర్యవేక్షణ లేకుండా చేసిన బహిష్కరణ చర్యలు. వారు తగిన సాక్ష్యాలు లేకుండా సామాజిక పరమైన కమ్యూనిటీలపై కేవలం అనుమానంతో ఈ చర్యలకు దిగారు. అసోం సంక్లిష్ట వలస చరిత్ర చాలా కాలంగా రాజకీయ పరంగా రూపుదిద్దుకున్నది. ఈ మధ్య కొద్ది కాలంగా అక్రమ వలసపై పాలనాపరమైన ధ్రువీకరణ మరింత దూకుడుగా, నిర్ణయాత్మకంగా మారుతున్నట్లు కన్పిస్తోంది. చట్టపరమైన ప్రక్రియను కానీ, పేదల వాస్తవిక జీవితాలను కానీ అంతగా పట్టించుకోవడం లేదు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం, వలసదారుల (అసోం నుంచి బహిష్కరణ) చట్టం 1950 కింద వందలాది మంది సరైన పత్రాలులేని వ్యక్తులను వెనక్కి నెట్టివేసిన విషయాన్ని బహిరంగంగా ప్రకటించుకుంటోంది. ఇలాంటి ప్రకటనలు రాజకీయంగా నియోజకవర్గాల్లో బాగా పనిచేస్తాయి. కానీ, ఏకపక్ష బహిష్కరణలు చట్టబద్ధంగా అసాధ్యం అన్న అంశాన్ని మరుగుపరుస్తాయి.భారతదేశం – బంగ్లాదేశ్ మధ్య పరస్పరం వ్యక్తులను స్వదేశాలకు పంపించే ఒప్పందం లేదు. బహిష్కణకు స్పష్టమైన డాక్యుమెంట్‌లు, రుజువులు, వారిని స్వీకరించే దేశం అంగీకారం చాలా అవసరం. ఇవి లేకుండా నెట్టివేతలు నాటకాల వంటివే. దీనివల్ల తలెత్తే పరిణామాలు ప్రభుత్వాలకన్నా, ఆ పౌరుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. జీవితాలే తల్లకిందులైపోతాయి. నెట్టివేతకు లక్ష్యంగా చేసుకున్న వ్యక్తులు.. పేదవారై ఉంటారు. వారి చదువు అంతంత మాత్రమే. ఎక్కువ నిరక్షరాస్యులై ఉంటారు. అక్రమ వలస విషయంలో ఎలాంటి చిక్కులు ఎదురైనా, తమను తాము రక్షించుకునే సామర్థ్యం కూడా వారికి తక్కువే ఉంటుంది. రాజకీయపరంగా వాయిస్ లేని వారి వలసలకు, భాషా, –మతపరమైన మైనారిటీలకు మధ్య ఉండే తేడా తక్కువ. బెంగాలీ మాట్లాడే వారిని ఇప్పటికీ అనుమానితులు గానే చూస్తారు. ఒకప్పుడు రాజ్యాంగ పరమైన హామీగా ఉన్న పౌరసత్వం, కొన్ని కమ్యూనిటీల విషయంలో తాత్కాలిక హోదా మాదిరిగా ఉంది. ఇది డాక్యుమెంటేషన్ పై కాకుండా రాజకీయాలపై ఆధారపడి ఉంటోంది.సునాలీ కేసు ఈ లోపాలను స్పష్టం చేస్తోంది. ఆమె కుటుంబానికి ఓటర్ కార్డులు, రికార్డులు, రేషన్ కార్డులు ఉన్నాయి. కుటుంబానికి పశ్చిమబెంగాల్, అసోం రెండు రాష్ట్రాలతో సంబంధాలు ఉన్నాయి. ఇంతవరకూ ఆమెకు అనుకూలంగా తీర్పురాలేదు. అయినా, ఆమెను, ఆమె భర్త, ఇద్దరు పిల్లలనుంచి వేరు చేసి తీసుకెళ్లారు. గర్భిణి అయి కడుపులో బిడ్డను మోస్తున్న సమయంలో ఆమెను సరిహద్దులు దాటించి పంపివేశారు. ఆమె, చిన్నకొడుకు అర్థం చేసుకోలేని కష్టాల చిక్కుకుని, అతని కుటుంబం చట్టపరమైన సహాయం కోసం ఇబ్బంది పడుతుండగా, నెలల పాటు విదేశీ గడ్డపై బతకాల్సి వచ్చింది. ఆమె వివరాలు పరిశీలించిన తర్వాత, బంగ్లాదేశ్ అధికారులు ఆమె బంగ్లా జాతీయురాలు కాదని నిర్ధారించి. ఆమెకు బెయిల్ మంజూరు చేశారు. సునాలీ విషయంలో ఆమె పౌరసత్వం ఉన్న దేశం కంటే నెట్టివేయబడిన పొరుగు దేశం ఆమెకు తగిన ప్రక్రియకు కట్టుబడి ఉండడం విశేషం.తీవ్ర ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, అధికారుల ఓవర్ యాక్షన్ మాత్రమే కాదు, దేశం లో చట్టాలను గౌరవించకపోవడం. ప్రభుత్వ అధికారులు న్యాయవ్యవస్థను అతిక్రమించడం, రాజ్యాంగం కల్పించిన రక్షణలను ఇబ్బందికరంగా పరిగణించిన పక్షం అసలు పౌరసత్వం వ్యవస్థే దుర్బలంగా తయారవుతుంది. అనేక సందర్భాల్లో, కోర్టులు జోక్యం చేసుకుని సంజాయిషీ కోరడంతోపాటు, బహిష్కరణలను ఆపాయి. తప్పిపోయిన వ్యక్తులుగా ప్రకటించిన వారిని వెతికి పట్టుకుని హాజరుపరచాలని ప్రభుత్వాలను ఆదేశించాయి. న్యాయవ్యవస్థ జోక్యం, ప్రక్రియ చాలా ఆలస్యం అవుతుంది. ఈలోగా బాధితులు నెలల తరబడి వేదన అనుభవిస్తారు. ప్రజాస్వామ్య గణతంత్రం లో ఏ పౌరుడూ ఎదుర్కోకూడని పరిస్థితులు అనుభవిస్తాడు. ఆ తర్వాత అందే న్యాయం వల్ల ఏం లాభం. మనదేశంలో కోర్టులు, లాయర్ల ఫీజులు ఖరీదైనవి, చాలా కుటుంబాలకు కేసులు ఏళ్ల తరబడి కొనసాగించే అవకాశాలు లేవు, అలాంటి వారు తక్కువే. రాజకీయ పరమైన చిక్కులు చాలా విస్తృతంగా ఉంటాయి మతం, భాష, సామాజిక ఆర్థిక స్థితి ఆధారంగా పౌరసత్వాన్ని తలగించడం చేస్తే, అది గందరగోళానికి దారితీస్తుంది. కొందరు పౌరుల విషయంలో వివక్షకు దారితీస్తుంది.అది సాంకేతిక పరమైన, లేదా పాలనా పరమైన సమస్య కాదు, గణతంత్ర దృక్పథంలోనే మార్పునకు దారితీస్తుంది. స్వాతంత్ర్యం అంతరం భారత రాజ్యాంగం విలువలపై ఆధారపడిన సమ్మిళిత వర్గంగా పౌరసత్వాన్ని పరిగణించాలని ఆకాంక్షించింది. అయితే, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు, పౌరసత్వాన్ని అప్పుడప్పుడు చట్టవిరుద్ధ బలవంతం ద్వారా బహిష్కరణలకు సాధనంగా మార్చే ప్రమాదం ఉంది. ముందుకు సాగాలంటే, చట్టవిరుద్ధమైన బహిష్కరణలు వెంటనే నిలిపివేయాలి. ప్రభుత్వం ఎంతమంది ఇలాంటి ఇబ్బందులకు గురయ్యారో బహిర్గతం చేయాలి. ప్రతి కేసుకు చట్టపరమైన ఆధారం అందించాలి. విదేశీయుల ట్రిబ్యునళ్లకు నిర్మణాత్మక సంస్కరణలు, న్యాయపరమైన పర్యవేక్షణ అవసరం. పేదలకు పౌరహక్కు కోల్పోకుండా చట్టపరమైన సహాయాన్ని విస్తృతం చేయాలి. అన్నిటికంటే ముఖ్యం ఒక వర్గం పౌరులను శాశ్వత అనుమానితులుగా భావిస్తే, ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తుంది. మత పరమైన అంతరాలను తీవ్రతరం చేస్తుందని రాజకీయ నాయకులు గుర్తించాలి. సునాలి ఖాతున్, ఇతరుల పునరాగమన ఉదంతం కోర్టులు, పౌర సమాజం, సాధారణ పౌరులు అన్యాయాన్ని తిప్పికొట్టగలరని రుజువు చేసింది. సరిహద్దులను దాటడం భౌగోళికం మాత్రమే కాదు ఓ హెచ్చరిక కూడా. గణతంత్ర రాజ్యం ఈ హద్దును మరచిపోకూడదు.

# పుత్రిక రాజకీయ అరంగేటం.. గ్రౌండ్ ప్రిపరేషన్ లో బొత్స!





అమరావతి,బొత్స సత్యనారాయణ.. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నాతనదైన రాజకీయం చేయడంలో ఆరితేరిన వారన్న పేరుంది ఆయనకు. విజయనగరం రాజకీయాల్లో బొత్స ఫ్యామిలీ నుంచి ఇప్పటికే చాలామంది ఉన్నారు. కానీ.. ఇప్పుడు బొత్స పక్కా రాజకీయ వారసత్వం మీద దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా, వైసీపీ శాసన మండలి పక్షనేతగా వ్యవహరిస్తున్న బొత్స మారుతున్న రాజకీయ, పరిణామాల దృష్ట్యా ప్రత్యామ్నాయాలవైపు దృష్టి సారిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే తాను పొలిటికల్ గా యాక్టివ్‌గా ఉన్నప్పుడే వారసుల్ని రంగంలోకి దింపాలని భావిస్తున్నారని అంటున్నారు. తన కుమార్తె తన కుమార్తె బొత్స అనూష పొలిటికల్ ఎంట్రీకి రంగం సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు.బొత్స వారసురాలి పొలిటికల్ ఎంట్రీకి కావాల్సిన గ్రౌండ్ వర్క్ పెద్ద ఎత్తున జరుగుతోందని తెలుస్తోంది. ఇటీవల చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో వైసీపీ కార్యక్రమాల్లో అనూష చురుగ్గా పాల్గొంటున్నారు. ఆమె పొలిటికల్‌గా యాక్టివ్ అవుతున్నారనడానికి ఇదే సంకేతమని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. వివిధ కార్యక్రమాల పేరిట బొత్స అనూష ప్రజల్లోకి వెళ్తున్న తీరు, అందర్నీ కలుపుకుని పోయేందుకు చూపిస్తున్న చొరవ చూస్తుంటే అతి త్వరలోనే ఆమె రాజకీయ ఎంట్రీకి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడుతుందని పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్నది. చీపురుపల్లి నియోజకవర్గంలో బొత్స సత్యనారాయణకు ప్రత్యామ్నాయంగా అనూష ప్రొజెక్ట్ చేసే ప్రయత్నం జరుగుతోందని సొంత కేడరే చెబుతోంది. వృత్తి పరంగా డాక్టర్ అయిన అనూష ఇటీవల సెగ్మెంట్‌లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు, కేడర్ మీటింగ్స్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.ధీరా ఫౌండేషన్, సత్య ఎడ్యుకేషన్ సొసైటీల్లో డైరెక్టర్ గావున్న అనూష ప్రజల్లోకి వెళ్ళి వారికి కావల్సిన వైద్య సలహాలను అందిస్తున్నారు. అలాగే గుర్ల, మెరకముడిదాం మండలాల్లో అయితే%% స్థానిక నాయకులు ఏ కార్యక్రమం నిర్వహించినా అక్కడికి వెళ్లి తనదైన శైలిలో స్పందిస్తున్నారట. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రెండిటిలో ఏదో ఒక మండలం నుంచి జెడ్పీటీసీగా ఆమె పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. దాని ద్వారా ముందు జడ్పీ ఛైర్‌పర్సన్‌తో పొలిటికల్ కెరీర్ మొదలు పెట్టాలనుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. తల్లి ఝాన్సీ తరహాలోనే అనూష కూడా రాజకీయ ఆరంగేట్రం చేస్తారని బొత్స అనుచరగణం చెప్పుకుంటోంది. మరో వైపు ఇటీవలి కాలంలో అనూష పర్యటనల మీద ప్రజల స్పందన గురించి కూడా ఆరా తీశారట బొత్స సత్యనారాయణ. పాజిటివ్ రిపోర్ట్ రావడంతో%% ఇప్పుడు కోరుకుంటున్నట్టు రేపు పరిస్థితులన్నీ అనుకూలించి తాను రాజ్యసభకు వెళితే%% చీపురుపల్లి నియోజకవర్గ బాధ్యతల్ని అనూష చూసుకునేలా స్కెచ్ రెడీ చేస్తున్నారట. అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు ఇంకా చాలా టైం ఉన్నందున అప్పటికి ఎలాగోలా కుమార్తె సెట్ అవుతారన్న ఆలోచనలో ఉన్నారట బొత్స. ఓవరాల్‌గా ఆ కుటుంబం నుంచి మరో రాజకీయ వారసత్వం ఖాయమైపోయి ందంటున్నారు ఎమ్మెల్సీ సన్నిహితులు.

## 2026 సంవత్సర సెలవులు జాబితా విడుదల

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి సంబంధించిన సెలవుల వివరాలు విడుదల చేసింది. వచ్చే ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 27 సాధారణ సెలవులు , 26 ఐచ్ఛిక సెలవులను ప్రకటిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశాల మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2026 సంవత్సరంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు అధికారిక ఉత్తర్వులలో పేర్కొన్న మొత్తం 27 సాధారణ సెలవు దినాలలో మూసివేయబడతాయి. దీంతో పాటు ప్రతి నెలలోని ఆదివారాలు, రెండవ శనివారాలు యథావిధిగా సెలవు దినాలుగా కొనసాగుతాయి.

## వందేమాతరంపై ఇప్పుడే ఎందుకు చర్చ?

న్యూఢిల్లీ:దేశానికి స్వాతంత్ర్యంర వచ్చి 79 ఏళ్లు అవుతున్నదని, ఇప్పుడు వందేమాతరంపై చర్చ దేనికని కాంగ్రెస్ పార్టీ వాయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ ప్రశ్నించారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రం లోక్‌సభ లో ఈ గేయంపై చర్చ చేపట్టింది. ఈ చర్చలో పాల్గొన్న ప్రియాంకాగాంధీ ప్రభుత్వాన్ని పైవిధంగా ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు వందేమాతరంపై చర్చ చేపట్టడానికి రెండే రెండు కారణాలు ఉన్నాయని ప్రియాంకాగాంధీ చెప్పారు. అందులో మొదటిది వచ్చే ఏడాది జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు కాగా, రెండోది దేశ ప్రజల దృష్టిని భవిష్యత్తు వైపు మళ్లకుండా గతంపైనే నిలిపి ఉంచడం కోసమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ మంచి ప్రసంగం చేశారు కానీ, నిజాలు చెప్పడంలో ఆయన బలహీనంగా కనిపించారని అన్నారు. అంతేగాక 'మీరు ఎన్నికల కోసం పనిచేస్తుంటే మేం దేశ ప్రజల కోసం పనిచేస్తున్నాం' అని బీజేపీని ఉద్దేశించి ప్రియాంకాగాంధీ అన్నారు. మేం ఎన్ని ఎన్నికలు ఓడిపోయామనేది విషయం కాదని, మేం ప్రజల కోసం మీతో, మీ సిద్ధాంతాలతో పోరాడుతూనే ఉంటామని చెప్పారు. దేశం కోసం మా పోరాటం కొనసాగుతుందని, మా పోరాటాన్ని మీరు అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. భారతదేశంలోని ప్రతి అణువులో వందేమాతరం ఉందని, మరి దాని గురించి చర్చించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కారణంగా కేంద్ర ప్రభుత్వం వందేమాతరం గురించి చర్చిస్తోందని ఆమె ఆరోపించారు. వాస్తవానికి వందేమాతరం ప్రస్తావన వచ్చినప్పుడు, మనకు చరిత్ర గుర్తుకు వస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒకప్పటి ప్రధానిగా కనిపించడం లేదు. ఆయన మంచి ప్రసంగాలు చేస్తారు, కానీ వాస్తవాలను అర్థం చేసుకోరు. మోడీ ప్రజలకు వాస్తవాలను అందించే విధానం ఆయన నైపుణ్యానికి నిదర్శనం. కానీ నేను ప్రజా ప్రతినిధిని ? కళాకారుడిని కాదు' అని ప్రియాంక గాంధీ అన్నారు. వందేమాతరం గురించి ప్రస్తావించినప్పుడు, మనకు మొత్తం చరిత్ర గుర్తుకు వస్తుందని, అది స్వాతంత్ర్య పోరాట చరిత్ర, స్వేచ్ఛ కోసం పోరాటం, నైతికత, బ్రిటిష్ సామ్రాజ్య పతనం గుర్తుకు వస్తుందన్నారు. వందేమాతరం భారతదేశ ప్రజలను రాజకీయ, నైతిక ఆకాంక్షతో అనుసంధా నించిందని అన్నారు. వందేమాతరం నిద్రపోతున్న భారతదేశాన్ని మేల్కొలిపిందని, దానిపై ఈ రోజు చర్చ వింతగా అనిపిస్తుందని చెప్పారు. ఇంతకీ ఈ రోజు ఈ చర్చ అవసరం ఏమిటి, దీని ఉద్దేశ్యం ఏమిటి? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం భవిష్యత్తు వైపు చూడాలని అనుకోకుండా, మనల్ని గతంలోకి లాగడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. నిజం ఏమిటంటే నేడు ఉన్న ప్రధాన మంత్రి మోడీ ఒకప్పటి ప్రధానిగా లేరని, ప్రస్తుత ఆయన విధానాలు దేశాన్ని బలహీనపరుస్తున్నాయని అన్నారు. నేడు దేశ ప్రజలు సంతోషంగా లేరని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిత్యం ప్రజలు అనేక సమస్యలతో పోరాడుతున్నారని, ప్రభుత్వం వాటికి పరిష్కారాలను కనుగొనడం లేదని అన్నారు. కొందరి కారణంగా దేశానికి హాని జరుగుతోందని అన్నారు. అందుకే ఈ రోజు వందేమాతరం గురించి చర్చిస్తున్నామని, వాస్తవానికి దేశంలోని ప్రతి అణువులో వందేమాతరం సజీవంగా ఉందని, దాని గురించి చర్చించకూడదని స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై ఒత్తిడి తేకుండా దేశం దృష్టిని మళ్లించాలని ఈ ప్రభుత్వం వందేమాతరం పై చర్చ పెట్టి కోరుకుంటోందని ప్రియాంక గాంధీ అన్నారు. వందేమాతరం స్వభావాన్ని ప్రశ్నించడం దానికి సంబంధించి నిర్ణయాలు తీసుకున్న గొప్ప వ్యక్తులను అవమానించడమే ఈ చర్చ ఉద్దేశమని విమర్శించారు. నెహ్రూ ఇస్రోను సృష్టించకపోతే, మీరు ఈరోజు చంద్రుడిని చేరుకునేవారు కాదు. ఆయన గెయిల్, బిహెచ్ఇఎల్, సెయిల్‌లను సృష్టించకపోతే భారతదేశం ఎలా ఉండేది? పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఈ దేశం కోసమే జీవించారని ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు.

## వందేమాతరంపై బిజెపి వారు మాట్లాడడమా?

న్యూఢిల్లీ, నాడు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనని వాళ్లు ఇప్పుడు వందేమాతరం గురించి, ఆ గీతం విలువల గురించి మాట్లాడుతున్నారని సమాజ్‌వాది పార్టీ ఎంపి అఖిలేష్ యాదవ్ విమర్శించారు. లోక్‌సభలో వందేమాతరంపై చర్చలో పాల్గొన్న అఖిలేష్.. అధికార బీజేపీ నేతలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. వందేమాతరం జాతీయ గేయమని, ఆ గేయాన్ని ఒకరి నమ్మకాలను ఇతరులపై రుద్దే సాధనంగా వినియోగించడం కరెక్టు కాదని అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో చర్చ చేపట్టారు. వందేమాతర గీతం స్ఫూర్తిని ప్రతిఒక్కరూ అనుసరించాలని, స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా ఈ గీతం ప్రజలను ఒక్కటి చేసిందని అన్నారు. అయితే ఇవాళ కొన్ని విచ్ఛిన్నకర శక్తులు దేశాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం వందేమాతరం గీతాన్ని వాడుకుంటున్నాయని బీజేపీపై విమర్శలు చేశారు. వాళ్లు నాడు బ్రిటిష్ పాలకులు పాటించిన 'విభజించు.. పాలించు' పాలసీనే అనుసరిస్తున్నారని ఆరోపించారు.

### వందేమాతర గీతానికి నెహ్రూతోనే గౌరవం

న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్రమోదీ పై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. లోక్‌సభలో వందేమాతరంపై చర్చ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ చేసిన వ్యాఖ్యలను.. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ తప్పుపట్టారు. వందేమాతరం పై చర్చ సందర్భంగా ప్రధాని దేశ చరిత్రను వక్రీకరించి తిరగరాసేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. బీజేపీ ఎంత ప్రయత్నించినా నెహ్రూ వారసత్వాన్ని అడ్డుకోలేదని గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యానించారు. వందేమాతరం గేయానికి ప్రాముఖ్యతను ఇచ్చింది, ఆ గేయానికి జాతీయ గేయం హోదాను కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తుచేశారు. ఏ అంశంపై మాట్లాడినా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరును, కాంగ్రెస్ పార్టీ పేరును ప్రస్తావించడం ప్రధాని మోదీకి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.ఆపరేషన్ సింధూర్‌పై చర్చ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ నెహ్రూ పేరును 14 సార్లు, కాంగ్రెస పార్టీ పేరును 50 సార్లు ప్రస్తావించారని గొగోయ్ తెలిపారు. అదేవిధంగా 75వ రాజ్యాంగ దినోత్సవరం సందర్భంగా కూడా ప్రధాని మాట్లాడుతూ.. నెహ్రూ పేరును 10 సార్లు, కాంగ్రెస్ పేరును 26 సార్లు ప్రస్తావించారని చెప్పారు. వందేమాతరం గేయానికి ప్రాముఖ్యతనిచ్చిన పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు.

### మావోయిస్టులకు మరో దెబ్బ

రాయ్‌పూర్, మావోయిస్టులకు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో కీలక నాయకుడు, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రాంధేర్ కూడా ఉన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపిన ఎంఎంసీ జోన్‌లో రాంధేర్ కీలకంగా పని చేస్తున్నారు. మావోయిస్టు అగ్రనేత శీఘ్రనేత మిళింద్ తెల్టుంబే మరణించిన తర్వాత ఎంఎంసీ బాధ్యతలన్నీ రాంధేర్ చూసినట్లు పోలీసులు వెల్లడించారు. తాజాగా లొంగిపోయిన రాంధేర్‌పై రూ.3 కోట్ల రివార్డు ఉందని పోలీసులు ప్రకటించారు. రాంధేర్ లొంగుబాటుతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నక్సల్ క్రియాశీలతను గణనీయంగా తగ్గిస్తుందని భద్రతా వర్గాలు పేర్కొన్నాయి.

# వరల్డ్ బెస్ట్ ఫుడ్ సిటీలు.. దేశవ్యాప్తంగా ఆరు నగరాలు, హైదరాబాద్‌కు చోటు



హైదరాబాద్, భారత దేశ ఆహార సంస్కృతి శతాబ్దాలుగా అభివృద్ధి చెందింది. ప్రాంతీయ సంప్రదాయ వంటకాలు, స్ట్రీట్ ఫుడ్, ఇంటి వంటలు ఇలా చెప్పు కుంటూ పోతే చాలానే ఉంది. యుగయుగాలుగా సరిహద్దులను దాటింది. తాజాగా భారతీయ నగరాల వంటలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తోంది. స్పైసీ చాట్స్, స్వీట్ ట్రీట్స్, బిర్యానీల వంటివి ఉన్నాయి.

వరల్డ్ బెస్ట్ ఫుడ్ సిటీల్లో హైదరాబాద్

వరల్డ్ బెస్ట్ ఫుడ్ సిటీల టేస్ట్ అట్లాస్-2026 జాబితాలో దేశంలోని ఆరు నగరాలు చోటు దక్కించుకున్నాయి. అందులో హైదరాబాద్‌కు 54వ స్థానం దక్కింది. సుగంధ ద్రవ్యాలతో చేసే వంటకాలు ప్రపంచ వ్యాప్తంగా ఆహార ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. వంటలు, నాణ్యత ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉంది. ఇండియా నుంచి ఈసారి ఆరు నగరాలకు చోటు దక్కింది. గతేడాది మాదిరిగా ఈసారి ప్రపంచవ్యాప్తంగా 5వ స్థానాన్ని దక్కించుకుంది ముంబై సిటీ. అమృత్‌సర్-48, న్యూఢిల్లీ-53, హైదరాబాద్-54, కోల్‌కతా-73, చెన్నై-93వ స్థానాల్లో నిలిచాయి.ముంబై- ఎల్లప్పుడూ ఐకానిక్ వంటకాలైన తీపి-కారంగా కరకరలాడే భేల్ పూరి, పావ్ భాజీ, OG వడ పావ్, ప్యాటీస్ లేదా ఐకానిక్ మోదక్ వంటి చాట్‌లతో ఆహార ప్రియుల హృదయాలను గెలుచుకుంది ముంబై నగరం. ప్రపంచంలోని జాబితాలో ఈ నగరానికి ఐదో స్థానం సొంతం చేసుకుంది. స్ట్రీట్ ఫుడ్ తోపాటు టేస్ట్ అట్లాస్ రామ్ ఆశ్రయ, శ్రీ థాకర్ భోజనాలయం, కేఫ్ మద్రాస్, నవాబ్ సాహెబ్, బాబా ఫలూడా వంటి వాటితో ముంబైలోని అనేక ఐకానిక్ సాంప్రదాయ రెస్టారెంట్లను హైలైట్ చేసింది.

దేశవ్యాప్తంగా ఆరు నగరాలు, టాప్-5 లో ముంబై

అమృత్‌సర్- పంజాబీ వంటకాలకు పేరుగాంచింది ఈ సిటీ. అమృత్‌సరి కుల్చా, పాలక్ పనీర్, దాల్ మఖానీ, సర్సన్ కా సాగ్, స్వీట్ డిలైట్ ఫిర్నీ వంటి ప్రముఖ వంటకాలు ఉన్నాయి . కేసర్ ద ధాబా, భరవన్ దా ధాబా, బడే భాయ్ కా బ్రదర్స్ ధాబా, క్రిస్టల్ రెస్టారెంట్, పెహెల్వాన్ కుల్చా వంటి ఐకానిక్ సాంప్రదాయ రెస్టారెంట్లకు కొదవలేదు. వెన్నతో కూడిన పంజాబీ భోజనాలను కోరుకునే ఆహార ప్రియులను ఆకర్షిస్తూనే ఉన్నాయి.న్యూఢిల్లీ- ఇక ఢిల్లీ గురించి చెప్పనక్కర్లేదు. దాల్ మఖానీ, ముర్గ్ మఖానీ (బటర్ చికెన్), క్రిస్పీ పకోరాలు, చోలే భాతురే, సతత హరిత డెజర్ట్ గులాబ్ జామూన్ వంటి ఉత్తర భారత క్లాసిక్ వంటకాలకు రాజధాని మారింది.హైదరాబాద్-దేశ, విదేశీ ఆహార ప్రియులకు స్వర్గధామంగా గుర్తింపు పొందింది హైదరాబాద్ సిటీ. సాంస్కృతిక వైవిధ్యంతోపాటు అద్భుతమైన రుచులకు కేరాఫ్. ఆహారపు అలవాట్లు.. నిజాం, నగర చరిత్ర, భౌగోళిక స్థితిని ఇక్కడ ప్రతిబింబిస్తాయి. హైదరాబాదీ బిర్యానీతోపాటు తెలంగాణ, ఆంధ్రా సంప్రదాయ వంటకాలు, హలీమ్, ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్, డబుల్ కా మిఠా, మండి బిర్యానీ ఇలా చెప్పుకొంటూ పోతే పెద్ద జాబితా ఉంది. మొఘల్ సామ్రాజ్యం దక్షిణాదిలో విస్తరించినపుడు బిర్యానీ హైదరాబాద్ సిటీకి పరిచయమైందని అక్కడి వాసుల మాట. మొఘల్, అరబ్, పర్షియన్ దేశస్థుల వంటకాలతో స్థానిక దక్కన్ రుచుల మేళవింపుతో బిర్యానీ పుట్టుకొచ్చింది.కోల్‌కతా-రసగుల్లా, రోష్మలై, సందేశ్ వంటి స్వీట్ల కేరాఫ్ ఈ సిటీ కేరాఫ్. స్ట్రీట్ ఫుడ్ అనగా కాఠి రోల్, క్రీమీ ఫెర్మెంటెడ్ ట్రీట్ మిష్టి దోయి వరకు ఉంటుంది. ప్రియమైన పాత ప్రపంచ తినుబండారాల్లో టామరిండ్, చిత్తరంజన్ మిస్తాన్నా భండార్, అలెన్స్ కిచెన్, పీటర్ క్యాట్, లక్ష్మీ నారాయణ్ షా & సన్ వంటివి ఉన్నాయి.చెన్నైదక్షిణ భారతంలో కీలకమైన నగరాల్లో చెన్నై ఒకటి. దోస, ఇడ్లీ, హార్టీ చికెన్ 65, మృదువైన రుమాలీ రోటీ, సాంబార్ వంటి ప్రధాన వంటకాలకు ప్రపంచవ్యాప్తంగా ఆహారప్రియులకు ఇష్టమైనది. ఆ నగరానికి వెళ్తే.. కచ్చితంగా దోస, వడ, సాంబార్ కచ్చితంగా రుచులు చూస్తుంటారు. వీటికి కూడా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కింది.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ చుట్టూ రాజకీయాలు..

హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు బీజేపీ జై కొట్టడం వెనుక ఏం జరిగింది? ఓ వైపు ప్రభుత్వాన్ని విమర్శలు చేస్తూనే, మరోవైపు సపోర్టు చేయడం వెనుక కారణమేంటి? దీని వెనుక బీఆర్ఎస్ రాజకీయ కాలిక్యులేషన్స్ ఏ విధంగా ఉన్నాయి? తెలంగాణ వ్యాప్తంగా ఇప్పుడు దీనిపై చర్చ జరుగుతోంది.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కి బీజేపీ జై

తెలంగాణలో రాజకీయాలు విచిత్రంగా ఉంటున్నాయి. బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటేనని అధికార కాంగ్రెస్ పార్టీ చెబుతుంటే.. కాదు కాంగ్రెస్-బీజేపీ ఒక్కటేనని బీఆర్ఎస్ అంటోంది. తాజాగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ చుట్టూ కొత్త రాజకీయాలు మొదలయ్యాయి. భారత్ ఫ్యూచర్ సిటీలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'ని అత్యంత ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తోంది రేవంత సర్కార్.తెలంగాణ వచ్చిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అతి పెద్ద పెట్టుబడుల కార్యక్రమం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ప్రధానిని స్వయంగా ఆహ్వానించింది రేవంత్ సర్కార్. వీరితోపాటు దేశీయ, విదేశీ వ్యాపారవేత్తలు హాజరయ్యారు.

జాతీయ పార్టీల రాజకీయాలను గమనిస్తున్న బీఆర్ఎస్

నార్మల్‌గా అధికార పార్టీ చేసే ఏపనైనా విపక్షాలు విమర్శించడం సహజం. ప్రతిపక్ష పాత్రలో ఉన్న బీజేపీ.. గ్లోబల్ సమ్మిట్‌కు జై కొట్టడం బీఆర్ఎస్ నేతలకు మింగుడుపడడం లేదు. ఇక్కడే రకరకాల చర్చలు లేకపోలేదు. రేవంత్ సర్కార్ చేపట్టిన కార్యక్రమానికి బీజేపీ ఎందుకు సపోర్టు చేసిందనే దానిపై ఓపెన్‌గా చెబుతున్నారు ఆ పార్టీ నేతలు.రాజకీయం కేవలం ఎన్నికల సమయంలో మాత్రమేనని, అభివృద్ధి వేరన్నది కమలనాథుల మాట. అధికారంలో ఉన్నది



రాజకీయ ప్రత్యర్థి అయినా, పెట్టుబడులను రాకుండా అభివృద్ధిని అడ్డుకోవడం అన్నది తమ ఉద్దేశం కాదని అంటున్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తప్పకుండా సహకరిస్తుందని అంటున్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్లోబల్ సమ్మిట్‌ను స్వాగతిస్తున్నట్లు చెప్పారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు. కేందమంత్రి కిషన్ రెడ్డి హాజరుకావడం వెనుక ఉద్దేశం ఇదేనన్నది ఆయన మాట. రేపటి రోజున కేంద్రాన్ని వేలెత్తకుండా చూపకూడదన్నది బీజేపీ ఆలోచన. తాము వివక్ష చూపలేదని చెప్పడానికి ఇదే కారణమని అంటున్నారు.కాంగ్రెస్-బీజేపీల మధ్య జరుగుతున్న ఈ వ్యవహారాలను బీఆర్ఎస్ పెద్దలు క్షుణ్ణంగా గమనిస్తున్నారు. ఈ రెండు పార్టీలు కలిసి తమను టార్గెట్ చేసినట్టు కనిపిస్తోందని కారు పార్టీలో కొందరు నేతల మాట. ఒకవిధంగా చెప్పాలంటే తమను కార్నర్ చేశారని అంటున్నారు. ఈ సమ్మిట్‌పై అటు కేసీఆర్ ఆరా తీసినట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు బీఆర్ఎస్ పెద్దలు.

# త్వరలో వందేభారత్ స్లీపర్స్..ప్రారంభానికి ముమ్మరంగా ప్రయత్నాలు



న్యూఢిల్లీ, భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన .వందే భారత్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు దూసుకెళ్తున్నాయి. త్వరలోనే వందే భారత్ స్లీపర్ వెర్షన్‌ను సైతం పట్టాలెక్కించబోతున్నది. ఈ రైలు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి. తేజస్ రైలు తరహాలో వేగంగా.. రాజధాని రైలు లాంటి సౌకర్యాలు కలిగిన తొలిరైలు ఢిల్లీ-పాట్నా మార్గంలో నడువనున్నది. డిసెంబర్ చివరి నాటికి ఈ రైలు రాకపోకలు సాగించే అవకాశాలున్నాయి. ఈ రైలు ప్రారంభోత్సవానికి సంబంధించిన పనులన్నీ తుది దశలో ఉన్నాయి. ఈ రైలును ప్రారంభోత్సవం కోసం ప్రయాణికులు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నివేదిక ప్రకారం.. బెంగళూరులోని బీఈఎంఎల్, భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో తయారవుతున్న ఈ వందే భారత్ స్లీపర్ రెండు రేక్‌లలో ఒకటి ఇప్పటికే పూర్తయ్యింది. తొలి రేక్ డిసెంబర్ 12న ఉత్తర రైల్వేకు బయలుదేరుతుంది. ఆ తర్వాత ఢిల్లీ-పాట్నా మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈ రైలులో 16 కోచ్‌లు 827 బెర్త్‌లో ఉంటాయి. ఇందులో 611 థర్డ్ ఏసీ, 188 సెకండ్ ఏసీ, 24 ఫస్ట్ ఏసీ బెర్తులు ఉంటాయి. ఈ రైలును అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. రైలులో ఆటోమేటిక్ డోర్లు, బయో టాయిలెట్స్, సీసీటీవీ కెమెరాలు, వ్యక్తిగత రీడింగ్ లైట్లు, ప్రీమియం క్వాలిటీతో సౌకర్యవంతమైన ఇంటీరియర్ ఉంటుంది. ఈ రైలు గంటకు గరిష్టంగా 160 కిలోమీటర్ల వేగంతో నడిచేలా రూపొందించారు. ఇందులో కవచ్ సిస్టమ్, క్రాష్ రెసిస్టెంట్ స్ట్రక్చర్ వంటి అధునాతన భద్రత టెక్నాలజీ అమర్చారు. అవసరమైతే కోచ్ సంఖ్యను 24కు పెంచనున్నారు. ఢిల్లీ-రాజేంద్రనగర్ మార్గంలో తేజస్ మార్గంలో నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. వారంలో ఆరు రోజులు రాకపోకలు సాగిస్తుంది. రైలు సాయంత్రం పట్నా రాజేంద్రనగర్ టెర్మినల్ నుంచి సాయంత్రం బయలుదేరి ఉదయం ఢిల్లీకి చేరుకుంటుంది. తిరిగి తేజస్ రైలు తరహాలోనే నడుస్తుంది. నెలాఖరు నాటికి వందే భారత్ స్లీపర్ రైలును రెగ్యులర్‌గా నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా దానాపూర్ డివిజన్ ధ్రువీకరించింది.

# విజయసాయి కాషాయ మంత్రం..జగన్ కు కషాయం!

అమరావతి,రాజకీయాలకు అలవాటు పడిన నాయకులు వాటిని వదులు కోవడానికి ఇష్టపడరు. ఏదో ఆవేశంలో రాజకీయ వైరాగ్యం కలిగినా, మరీ ఆవేశపడి రాజకీయ సన్యాసం తీసుకున్నానంటూ ప్రకటనలు చేసేసినా.. ఆ ఆవేశం తగ్గాకా మళ్లీ వాళ్ల చూపు రాజకీయలవైపే అంటుంది. అడుగులు కూడా రాజకీయం వైపే పడతాయి. ఒక లగడపాటి రాజగోపాల్ అయినా, మరో ఉండవల్లి అరుణ్ కుమార్ అయినా.. ఇంకో వడ్డే శోభనాదీశ్వరరావైనా అంతే. అవకాశం లేక, జనం మెచ్చక, ఒప్పక వీరంతా రాజకీయ ప్రకటనలకే పరిమితమయ్యారు. అయితే విజయసాయిరెడ్డి పరిస్థితి అది కాదు.విజయసాయి అవేశంతో కంటే ఎంతో ఆలోచనతో రాజకీయ సన్యాసం ప్రకటించి, వ్యవసాయమే తన వ్యాపకం అని ప్రకటించేశారు. అలా ప్రకటించిన సందర్భంలోనే పరిశీలకులు ఇది వ్యూహాత్మక పొలిటికల్ రిటైర్మెంట్ అంటూ విశ్లేషణలు చేశారు. ఎందుకంటే.. వైసీపీలో ఒక సమయంలో ఆయన జగన్ తరువాత జగనంతటి నాయకుడిగా వెలుగొందారు. ఆయన రాజకీయ సన్యాసం ప్రకటించిన సమయంలో రాజకీయంగానే కాదు, కేసుల పరంగా కూడా నిండా మునిగి ఉన్నారు. ఇంత కాలం తన సర్వస్వం ధారపోసి పెంచిన పార్టీ దూరం పెట్టింది. అదే సమయంలో కేసులూ చుట్టుముట్టాయి. ఆ కేసుల నుంచి బయటపడాలంటే.. వైసీపీకి తాను దూరం అని నిరూపించుకోవాలి. అదే సమయంలో.. తన స్వేదంతో పెంచిన పార్టీలో.. తన ఉనికినే ప్రశ్నార్థకం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. అందుకు అవకాశం రావాలంటే.. పొలిటికల్ గా తాను న్యూట్రల్ గా ఉన్నాననీ, ఉంటాననీ నిరూపించుకోవాలి. అందుకే ఆ సమయంలో విజయసాయి రాజకీయ సన్యాసం పుచ్చుకుంటున్నట్లుగా ప్రకటించారని పరిశీలకులు విశ్లేషించారు. వారి విశ్లేషణలకు తగ్గట్టుగానే ఆయన వ్యవసాయమే వ్యాపకం అని ప్రకటించినా, సోషల్ మీడియా ద్వారా, చేయగలిగినంత రాజకీయం చేశారు.అలాగే కేసుల విచారణకు హాజరైన సందర్భంగా మీడియా ముందూ రాజకీయాలే మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో అరెస్టులకు ఆయన ఇచ్చిన లీకులే కారణమంటే అతిశయోక్తి కాదు. విజయసాయి వైసీపీ నుంచి బయటకు వచ్చి, రాజకీయ సన్యాసం ప్రకటించిన తరువాత ఆయన మాటలు, చేతలు, అడుగులూ అన్నీ బయటకు జగన్ కోటరీ టార్గెట్ అన్నట్లు కనిపించినా.. ఆయన అసలు లక్ష్యం జగన్ అన్నట్లుగానే సాగాయి. అంతెందుకు విజయసాయి వైసీపీకి గుడ్ బై చెప్పిన



తరువాత హైదరాబాద్ వెళ్లి మరీ జగన్ సోదరి షర్మిలతో భేటీ అయ్యారు. ఆ తరువాత కూడా విజయసాయి పొలిటికల్ గా బీజేపీకి చేరువ అవుతున్నారన్న ప్రచారం జరిగింది. ఇప్పుడు ఆ ప్రచారాలకీ, ఆ విశ్లేషణలకూ బలం చేకూర్చే విధంగా హిందుత్వకు మద్దతుగా ఆయన తన గళం వినిపించారు. అదీ అలా ఇలా కాదు.. వైసీపీ పునాదులే కదిలిపోయేంత గట్టిగా విజయసాయి బాం బు పేల్చారు. మొత్తంగా గత రెండు దశాబ్దాలుగా జరిగిన మతమార్పిడులపై విచారణ జరిపించాలనీ, ఇందుకు ఒక కమిటీని వేయాలని విజయసాయి డిమాండ్ చేశారు. హిందుత్వకు ద్రోహం చేసిన వారిని ఎవరినీ విడిచిపెట్టకూడదని ఉద్ఘాటించారు. ఈ మాటల వెనుక ఆయన ఆయన ప్రధాన టార్గెట్ వైసీపీ అండ్ జగన్ అని ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుందంటారు పరిశీలకులు. గత రెండు దశాబ్దాలుగా అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్న కాలం నుంచి ఇప్పటి వరకూ జరిగిన మతమార్పిడులపై విచారణ జరిపించాలన్నది ఆయన చేసిన డిమాండ్. వైఎస్ జమానాలో క్రైస్తవ మతంలోకి పెద్ద ఎత్తున మతమార్పిడులు జరిగిన విషయం అందరికీ తెలి సిందే. ఇప్పుడు విజయసాయిరెడ్డి డిమాండ్ ద్వారా బీజేపీకి పదునైన ఆయుధాన్ని అందించారని అంటున్నారు విశ్లేషకులు. ఇప్పుడు విజయసాయి ప్రత్యక్ష రాజకీయాలలో లేకపోవచ్చు కానీ, బీజేపీ గొంతుక వినిపించారు. తద్వారా తన అడుగులు ఎటు అన్న సంకేతాలు ఇచ్చారు. విజయసాయి కాషాయం పుచ్చుకుంటే.. జగన్ కు ఇక గడ్డుకాలమేనన్నది పరిశీలకుల విశ్లేషణ

# ఇండియాపై ఇంకా కోపం తగ్గలేదా ట్రంప్

వాషింగ్టన్:పనిలేనోడు రోజంతా ఎప్పుడు ఎవరో ఒకరి మీద పడి ఏడుస్తూనే ఉంటాడట.. ఇప్పుడు మన డొనాల్డ్ ట్రంప్ పరిస్థితి అలానే తయారైంది. అవును.. తన దేశంలో తనపై వ్యతిరేకతను తగ్గించుకోక ఇతర దేశాలపై పడి ఏడుస్తున్నాడు. ఇండియాపై ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్ లు వేసిన పెద్దమనిషి ఇప్పుడు ఇంకా ఆ కసి తీరనట్టు మరిన్ని ప్లాన్ చేస్తున్నాడు.ఇండియా, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించడానికి సిద్ధమవుతున్న వేళ ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ నుంచి దిగుమతయ్యే బియ్యం పై అదనపు సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు యోచిస్తున్నట్టు సమాచారం.చౌకైన విదేశీ వస్తువుల దిగుమతి తమ ఉత్పత్తిదారులను దెబ్బతీస్తోందని అక్కడి రైతులు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో ట్రంప్ ఈ అంశాన్ని పరిశీలిస్తున్నారు.అమెరికా రైతుల కోసం 12 బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీని ప్రారంభించేందుకు వైట్ హౌస్ లో జరిగిన ఓరౌండ్ టేబుల్ సమావేశం లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. పలుదేశాలు చౌక ధరలకే బియ్యాన్ని అమెరికా మార్కెట్ లోకి 'డంప్' చేస్తున్నాయనే వాదనలను తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న రైతులు, సబ్సిడీ పొందిన బియ్యం దిగుమతులు తమ మార్కెట్ లను దెబ్బతీస్తున్నాయని.. దేశీయ ధరలను తగ్గిస్తున్నాయని వాదించారు. పలు దేశాలు మోసం చేస్తున్నాయని.. అందుకే సుంకాల విధింపు చేపడుతున్నట్టు ట్రంప్ పేర్కొన్నారు.ఇక ఈ సమావేశంలోనే ఓ రైస్ మిల్ సీఈవో మెరిల్ కెన్నడీ మాట్లాడుతూ అమెరికా మార్కెట్ లోకి తమ ఉత్పత్తులను డంప్ చేస్తోన్న దేశాల్లో భారత్, థాయిలాండ్, చైనాలు ప్రధానంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో ప్యూర్టోరికోకు తామే బియ్యం ఎగుమతి చేసేవాళ్లమని.. కానీ ఇప్పుడు చైనా వస్తువులు అక్కడికి కూడా వెళుతున్నాయని ఆయన వాపోయారు. దక్షిణాది రాష్ట్రాల్లో తాము అనేక



ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే ట్రంప్ సీరియస్ చర్యల దిశగా అడుగుల వేస్తున్నారు. అమెరికా రైతుల ఉత్పత్తులన దెబ్బతీసేలా ఉన్న దేశాల జాబితాను సమర్పించాలని అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య కార్యదర్శి బెసెంట్ ను ఆదేశించారు. బెసెంట్ ఈ జాబితాలో భారత్, థాయ్ లాండ్, చైనాలు ముందున్నాయని తెలిపార. వీటిపై సత్వరం చర్యలు తీసకంటామని ట్రంప్ రైతులకు హామీ ఇచ్చార. ఈ పరిణామం భారత్ తో వాణిజ్య చర్చలకు ముందు చోట చేసుకోవడం గమనార్హం.ట్రేడ్ డీల్ కు సంబంధించిన చర్చల ఈనెల 10 నుంచి ఢిల్లీలో జరుగనున్నాయి. ఈ చర్చల్లో పాల్గొనేందుక అమెరికా డిప్యూటీ వాణిజ్య ప్రతినిధి రిక్ స్విట్జర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మన దేశంలో పర్యటించనుంది. భారత్ తరుపున వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ చర్చల్లో పాల్గొననన్నారు. రేపటి నుంచి జరుగబోయే వాణిజ్య చర్చలు మరింత ఉత్కంఠగా మారే అవకాశం ఉంది.

# నిర్వహణా లోపమే ఇండిగో సంక్షోభానికి కారణం



న్యూఢిల్లీ, ఇండిగో నిర్వహణ వైఫల్యమే ప్రస్తుత పరిస్థితులకు దారితీసిందని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు.'ఇండిగో సంక్షోభం' నేపథ్యంలో రామ్మోహన్ నాయుడు సోమవారం పార్లమెంట్‌లో ఓ ప్రకటన చేశారు. భవిష్యత్తులో ఇతర ఎయిర్‌లైన్స్ నుంచి ఇలాంటివి పునరావృతం కాకుండా మా చర్యలు ఉండనున్నాయి. భారతదేశంలో కొత్త విమానయాన సంస్థ ప్రారంభం కావడానికి ఇదే మంచి తరుణం. పోటీ సంస్థలు ఏర్పాటయ్యేలా చర్చలు జరపనున్నాం అని మంత్రి రాజ్యసభలో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే ఇండిగో సంక్షోభంపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి స్పందించి ప్రకటన చేశారు. విమానయాన సిబ్బంది పని గంటలపై పరిమితులకు సంబంధించిన నిబంధనలను ఇండిగో సరిగా అమలుచేయకపోవడమే సర్వీసుల రద్దుకు దారితీసిందని వెల్లడించారు. ఏవియేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్ ఈ అంతరాయాలకు కారణం కాదని తెలిపారు. సిబ్బందికి సంబంధించిన రోస్టరింగ్ విధానాన్ని సరిగా అమలుచేయలేదు.ఈ వైఫల్యానికి ఏఎంఎస్ఎస్ సిస్టమ్ కారణం కాదు. డిసెంబర్ ఒకటిన రోస్టరింగ్ నిబంధనలకు సంబంధించి ఇండిగోతో సమావేశం నిర్వహించాం. ఆ సంస్థ ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలపై మేం స్పష్టత ఇచ్చాం. అప్పుడు వారు ఎలాంటి సమస్యలను ప్రస్తావించలేదు. ఇక సమస్యను పరిష్కరించేందుకు ఎయిర్‌లైన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం కొన్ని రోజులుగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర అంతరాయానికి చింతిస్తున్నాను. ఈ సమస్యను మేం తేలిగ్గా తీసుకోలేదు. ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించాం. ఇదిలాఉంటే.. ఇండిగో వ్యవహారంపై కేంద్రం ఇప్పటికే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. కొద్దిరోజులుగా సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మొత్తం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని పౌర విమానయాన శాఖ ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ సంజయ్ కె.బ్రహ్మనే, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ గుప్తా, సీనియర్ ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాన్‌గ్లిక్, ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ రాంపాల్ ఉన్నారు. వీరు భవిష్యత్తులో ఎలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా కొన్ని సిఫార్సులు కూడా చేయనున్నారు.

## 16 నుంచి తిరుప్పావై ప్రవచనాలు

తిరుమల, పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు.ఇందులో భాగంగా తిరుపతితో పాటు ఆంధ్రప్రదేశ్‌లో 76, తెలంగాణలో 57, తమిళనాడులో 73, కర్ణాటకలో 21, పాండిచ్చేరిలో 4, న్యూఢిల్లీ, ఒడిశాలో ఒకొక్క కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నామని

# కామధేనువుగా మారిన కూకట్‌పల్లి



హైదరాబాద్,హైదరాబాద్‌కు కూకట్‌పల్లి కొందరికి కామధేనువుగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. కూకట్‌పల్లిలో పర్యటించిన కవిత... వై జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... మేడ్చల్ జిల్లా పర్యటనలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో తమ పర్యటన సాగుతోందన్నారు. ఇక్కడ 2 వేల కోట్ల రూపాయల విలువైన భూములను ప్రభుత్వం అమ్మిందని... కానీ కూకట్‌పల్లి నియోజకవర్గం కోసం కనీసం రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు.గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ అని గొప్పగా పెడుతున్నారని.. కానీ కూకట్‌పల్లిలో కనీస వసతులు లేవన్నారు. ఇక్కడ ఒక్క స్టేడియం కూడా లేదని విమర్శించారు. అసలు హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీ అని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉందన్నారు. కూకట్‌పల్లి అంటే ఒక మిని ఇండియా మాదిరిగా ఉందన్నారు. కానీ ఇక్కడ పేదవాళ్లు రెంట్‌కు ఇళ్లు తీసుకునే పరిస్థితి కూడా లేదని చెప్పుకొచ్చారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే వచ్చి ఓట్లు అడుగుతున్నారని.. ఓట్లు లేనప్పుడు వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకోవటం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. పాలక పక్షం పట్టించుకోవటం లేదని.. ప్రతిపక్షం అడగటం లేదన్నారు. అందుకే జాగృతి బాధ్యతను భుజాన వేసుకొని ప్రశ్నిస్తోందని తెలిపారు. కూకట్‌పల్లిలో భూములు అమ్మడే కాదు.. ఇక్కడ అభివృద్ధిపై కాంగ్రెస్ శ్రద్ధ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com